

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575



www.rajamudranews.com
అక్షర రాజముద్ర
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక
AKSHARA RAJAMUDHRA
RNI No: TELTEL/2024/86684

| మేడ్చల్-మల్కాజ్ గిరి | శనివారం | 19-09-2026 | సంపుటి: 3 | సంచిక: 226 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | SATURDAY | 19-09-2026 | VOLUME : 3 | ISSUE : 226 | PAGES: 8 | COST: 2/- |



## విలేకరులు కావలెను

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9182 474 575


### 22ఏ భూముల వివాదాల పరిష్కారానికి
# హైలెవల్ కమిటీ

- ముగ్గురు సీనియర్ అధికారులతో కమిటీ ఏర్పాటు
- సీసీఎల్ఏ కమిషనర్ లోకేష్ కుమార్‌కు చైర్మన్ బాధ్యతలు
- పాపిరెడ్డి, రాజీవ్ గాంధీ హనుమంతు సభ్యులుగా నియామకం
- భూ బాధితుల సమస్యల పరిష్కారానికి విధివిధానాల రూపకల్పన
- కల్వకుంట్ల కుటుంబం భూములపై అసెంబ్లీలో సీఎం రేవంత్ వ్యాఖ్యలు
- రేవంత్ కుటుంబ భూములు లెక్కలూ బయటపెడతామన్న కేటీఆర్, హరీశ్‌రావు



**హైదరాబాద్, సెప్టెంబర్ 18:**
తెలంగాణలో వివాదాస్పదంగా మారిన 22ఏ నిషేధిత భూముల సమస్య పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి

మిగతా 2వ పేజీలో..

### మిగిలిన ఇళ్లను కూడా
# కేటాయించండి

- పంట మార్పిడిపై సహకరించాలి
- కేంద్ర మంత్రి చౌహాన్‌కు సీఎం వినతి



2

## సమన్వయంతో పనిచేయండి

- ఖేలో ఇండియా గేమ్స్‌ను విజయవంతం చేయండి
- గేమ్స్ నిర్వహణపై సీఎస్ ఉన్నతస్థాయి సమీక్ష



2



# దానం నాగేందర్‌పై
# అనర్హత వేటు

- స్పీకర్ ట్రిబ్యునల్ ఉత్తర్వులను కొట్టివేసిన హైకోర్టు
- జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం.మొహియుద్దీన్ ధర్మాసనం తీర్పు
- ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయకుండానే కాంగ్రెస్ నుంచి లోక్‌సభకు పోటీ
- ఖైరతాబాద్ స్థానం ఖాళీ అయినట్లు స్పీకర్, ఈసీకి హైకోర్టు సమాచారం
- తీర్పుపై స్టే కోరిన దానం తరపు న్యాయవాదుల అభ్యర్థన తిరస్కరణ

### ఖైరతాబాద్ ఎమ్మెల్యే పదవి నుంచి దానం నాగేందర్ తొలగింపు

**హైదరాబాద్, సెప్టెంబర్ 18:**
ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేస్తూ తెలంగాణ హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా గెలిచిన దానం.. ఎమ్మెల్యే పదవికి, పార్టీకి రాజీనామా చేయకుండానే 2024 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు. ఈ వ్యవహారంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి వేర్వేరుగా దాఖలు చేసిన పిటిషన్లపై విచారణ జరిపిన ధర్మాసనం శుక్రవారం తీర్పు ఇచ్చింది.

**స్పీకర్ నిర్ణయం తప్పుబాటు**
దానం పార్టీ ఫిరాయింపునకు పాల్పడలేదంటూ స్పీకర్ ట్రిబ్యునల్ మార్చి 11న ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ కౌశిక్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డిలు హైకోర్టును ఆశ్రయించారు. పార్టీ ఫిరాయింపులకు సంబంధించిన ఆధారాలను స్పీకర్‌కు సమర్పించినప్పటికీ వాటిని పరిగణనలోకి తీసుకోలేదని

మిగతా 2వ పేజీలో..

## మిగిలిన 8 మంది ఎమ్మెల్యేల సంగతేంటి?

- దానం నాగేందర్‌పై అనర్హత వేటుతో ఫిరాయింపుల కేసుల్లో కొత్త చర్చ
- కాంగ్రెస్‌లో చేరిన ఇతర బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై పిటిషన్లు పెండింగ్
- ప్రతి కేసులోని వాస్తవాలు, ఆధారాలను విడివిడిగా పరిశీలించాల్సిన పరిస్థితి
- దానం తీర్పు నేపథ్యంలో మిగిలిన కేసులపైనా పెరిగిన ఉత్కంఠ
- తదుపరి పరిణామాలపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి

2

## ఉప ఎన్నిక వచ్చినా సిద్ధమే: దానం నాగేందర్

- హైకోర్టు తీర్పును స్వాగతించిన ఖైరతాబాద్ ఎమ్మెల్యే
- ఉప ఎన్నిక వస్తే పోటీ చేసేందుకు సిద్ధమని వెల్లడి
- ఎన్నికల్లో పోటీ చేయడం తనకు కొత్త కాదని వ్యాఖ్య
- సుప్రీంకోర్టును ఆశ్రయించే ఆలోచన లేదని స్పష్టీకరణ • అనర్హత వేటుపై ఎలాంటి ఆందోళన లేదన్న దానం
- ప్రజల మద్దతు తనకే ఉంటుందని ధీమా

2

## హైకోర్టు తీర్పు ప్రజాస్వామ్య విజయం

2

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు

# ఫార్ములా ఈ రేసుపై తప్పుడు కేసులు

- హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెంచేందుకే రేస్ నిర్వహించాం
- అవినీతి జరిగిందంటూ కాంగ్రెస్ ప్రభుత్వం అసత్య ఆరోపణలు
- కేసులకు భయపడేది లేదు.. న్యాయవ్యవస్థపై నమ్మకం ఉంది
- ఎప్పుడు పిలిచినా విచారణకు హాజరవుతా: కేటీఆర్
- టార్గెట్ కేసీఆర్‌గానే కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శ
- లక్ష కోట్ల ఆస్తులుంటే రూ.1,000 కోట్లకే తీసుకోండి అంటూ సవాల్



2

# ఎర్రవల్లి పరిధిలో 388 ఎకరాల్లో సర్వే ముమ్మరం

- నాలుగు బృందాలుగా రంగంలోకి సర్వేయర్లు
- 325 సర్వే నంబర్ లో హద్దుల పరిశీలన
- ఎర్రవల్లి 325 సర్వే నంబర్ భూములపై ఉత్కంఠ

**మర్కుక్, సెప్టెంబర్ 18:**
మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఎర్రవల్లి ఫామ్ హౌస్ పరిధిలోని భూములపై రెవెన్యూ అధికారులు సర్వేను ముమ్మరం చేశారు.మర్కుక్ మండలం 325 సర్వే నంబర్ పరిధిలోని 388 ఎకరాల భూమిలో బుధవారం సర్వేయర్లు నాలుగు బృందాలుగా

మిగతా 2వ పేజీలో..



## ఆర్టీసీలో గుర్తింపు సంఘం ఎన్నికలకు షెడ్యూల్

- ఎనిమిదేళ్ల నిరీక్షణకు తెర.. ఈ నెల 21 నుంచి ఎన్నికల ప్రక్రియ
- అక్టోబర్ 9న పోలింగ్.. 17న ఫలితాల వెల్లడి
- అక్టోబర్ 26న తుది ఓటరు జాబితా విడుదల
- వేతనాలు, డీఏ, బోనస్, ఉద్యోగ భద్రతపై యూనియన్ల ప్రచారం
- చివరిసారిగా 2016 జూలై 19న జరిగిన ఎన్నికలు

2







## సభను అగౌరవపరిచిన బీఆర్ఎస్

- శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్ బాబు
- సమావేశాలకు రాకూడదనే ఉద్దేశంతోనే నిబంధనల ఉల్లంఘన
- స్పీకర్‌ను దూషించడం అప్రజాస్వామికం
- మాక్ అసెంబ్లీ దుర్మార్గమైన చర్య
- భూకబ్జాలపై హైపవర్ కమిటీ... నెల రోజుల్లో నివేదిక
- నిరవధికంగా వాయిదా పడిన అసెంబ్లీ

3

# ఎల్‌నినో అధిగమించేందుకు ముందస్తు కార్యాచరణ

- తాగునీటికే తొలి ప్రాధాన్యం
- రికార్డు స్థాయిలో 19,543 మెగావాట్ల విద్యుత్ డిమాండ్‌ను తీర్చాం
- వర్షాభావ పరిస్థితులతో వరి సాగు 18% తగ్గుదల
- ప్రత్యామ్నాయ పంటల వైవిధ్యీకరణకు ప్రాధాన్యం
- 'తెలంగాణ జలసిరి'తో భూగర్భ జలాల పునరుద్ధరణకు చర్యలు
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



3

## ఉప ఎన్నిక వచ్చినా సిద్ధమే: దానం నాగేందర్

**హైదరాబాద్, సెప్టెంబర్ 18:**

ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ హైకోర్టు తీర్పుపై తొలిసారిగా స్పందించారు. న్యాయస్థానం ఇచ్చిన తీర్పును పూర్తిగా స్వాగతిస్తున్నట్లు తెలిపారు. ఒకవేళ నియోజకవర్గంలో ఉప ఎన్నికలు జరిగితే పోటీ చేసేందుకు తాను సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు.



**ఉప ఎన్నిక వచ్చినా పోరాటం**

ప్రజాక్షేత్రంలో ఎన్నికల్లో పోటీ చేయడం తనకు కొత్తేమీ కాదని దానం నాగేందర్ అన్నారు. రాజకీయ పోరాటాల్లో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొని విజయం సాధించడం తనకు అలవాటేనని వ్యాఖ్యానించారు. భవిష్యత్‌లో ఎలాంటి పరిణామాలు ఎదురైనా చట్టబద్ధంగా, రాజకీయంగా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.

**సుప్రీంకోర్టుకు వెళ్లే ఆలోచన లేదు**

హైకోర్టు ఉత్తర్వులను సవాల్ చేస్తూ ప్రస్తుతానికి సుప్రీంకోర్టును ఆశ్రయించే ఆలోచన లేదని దానం నాగేందర్ స్పష్టం చేశారు. తనపై అనర్హత వేటు పడే అవకాశం ఉన్నప్పటికీ తాను ఆందోళన చెందడం లేదన్నారు. నియోజకవర్గ ప్రజల మద్దతు తనకు ఎప్పుడూ ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు.

## హైకోర్టు తీర్పు ప్రజాస్వామ్య విజయం

**హైదరాబాద్, సెప్టెంబర్ 18 :**

ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ పార్టీ ఫిరాయింపు వ్యవహారంలో హైకోర్టు ఇచ్చిన చారిత్రక తీర్పును బీజేపీ స్వాగతిస్తోందని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు అన్నారు. బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు నాగేందర్‌ను అనర్హుడిగా ప్రకటించడమే కాక ఒక పార్టీపై గెలిచి మరో పార్టీ తరఫున నామినేషన్ వేసిన నాటినుంచే ఆ అనర్హత వర్తిస్తుందని పేర్కొనడం, స్పీకర్ నిర్ణయాన్ని పక్కనపెట్టడం అత్యంత కీలక పరిణామమని పేర్కొన్నారు. ఈ విజయం నైతికంగా, చట్టపరంగా రాజ్యాంగానికి లభించిన తిరుగులేని గెలుపని కొనియాడారు. చేతిలో రాజ్యాంగ పుస్తకం పట్టుకుని నీతులు చెప్పే రాహుల్ గాంధీ తన తండ్రి రాజీవ్ గాంధీ తెచ్చిన 10వ షెడ్యూల్ (పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం) మార్గదర్శకాలను స్వయంగా విస్మరించడం హాస్యాస్పదమని విమర్శించారు. గతంలో బీఆరఎస్ ప్రభుత్వం ఏ విధంగానైతే పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించిందో నేటి కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే దారిలో వెళ్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. హైకోర్టు తాజా తీర్పు కాంగ్రెస్ ప్రభుత్వ అనైతిక విధానాలకు చెంపపెట్టు అని, నైతికంగా, చట్టపరంగా, రాజ్యాంగబద్ధంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా ఓడిపోయిందని స్పష్టం చేశారు. అంతేకాక స్పీకర్ నిర్ణయం తప్పని న్యాయస్థానంలో తేలిపోయిందన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థపై నిజమైన గౌరవం ఉంటే ఒక పార్టీ నుంచి మరో పార్టీలోకి ఫిరాయించిన ఎమ్మెల్యేలందరూ తక్షణమే తమ పదవులకు రాజీనామా చేయాలని రామచందర్ రావు డిమాండ్ చేశారు. వారు ఏ పార్టీలో చేరారో అదే పార్టీ గుర్తుపై మళ్లీ పోటీ చేసి ప్రజాక్షేత్రంలో ప్రజాతీర్పును పొంది గెలవడమే నిజమైన రాజ్యాంగ స్ఫూర్తి అని తేల్చిచెప్పారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ విలువలను కాపాడే దిశగా వెలువడిన ఈ తీర్పు ప్రజాస్వామ్యానికే గర్వకారణమని ఆయన పునరుద్ఘాటించారు.

## ఎర్రవల్లి పరిధిలో 388 ఎకరాల్లో సర్వే ముమ్మరం

**మొదటిపేజీ తరువాయి**

జిల్లా సర్వేయర్ అనిల్, శంకర్, డివిజన్ సర్వేయర్ వంశీ, మండల సర్వేయర్ ప్రజ్వల సర్వే చేపట్టారు. ఫీల్డ్ లో సర్వే చేస్తుండగా మర్కుక్ తహసీల్దార్ కార్యాలయంలో మరి కొందరు సర్వేయర్లు ఉంటూ ఫీల్డ్ లో ఉన్న బృందాలకు ఎప్పటికప్పుడు గైడెన్స్ ఇస్తూ సమాచారం సేకరించారు.ఈ సర్వేలో ప్రభుత్వ ఉన్నతాధికారులు నేరుగా పాల్గొనలేదు.325 సర్వే నంబర్ లో మొత్తం 388ఎకరాల భూమి ఉంది.ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన రైతులు మాట్లాడుతూ 325 సర్వే నంబర్ లో కేసీఆర్ పేరు మీద గానీ, ఆయన కబ్జా చేసింది గానీ ఇంచు కూడా లేదు అని,అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడింది తప్పు అని చెప్పారు. మరికొందరు రైతులు 325 సర్వే నంబర్ పరిధిలో దాదాపు 80 నుండి 90 ఎకరాల్లో చెరువు తవ్వించి దానికి పాండురంగ డ్యాం అని నామకరణం చేశారని, ఆ చెరువు కింద భూములు కోల్పోయిన తమకు ఇంకోచోట భూమి ఇప్పిస్తానని చెప్పి ఇప్పటివరకు ఇప్పించలేదని ఆరోపించారు. 325 సర్వే నంబర్ లోని లావణి పట్టా భూములు 388 ఎకరాలను తమ పేరు మీద శాశ్వతంగా పట్టా చేయాలని, తమ ఆధీనంలో ఉన్న భూముల జోలికి రావద్దని రైతులు సర్వే బృందాలకు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా సర్వే అధికారులు సేవ్య నాయక్ డిప్యూటీ ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ 325 సర్వే నంబర్ లో ప్రభుత్వ భూమి పూర్తి విస్తీర్ణం 388.5 గుంటల భూమి ఇది మూడు గ్రామాల శివారులను శివార్ వెంకటాపూర్,వరదరాజపూర్ ఎర్రవల్లి ఆనుకొని ఉన్నదని,ఎర్రవల్లి భూమిని సర్వే చేయమని అధికారులు ఆదేశించారని తెలిపారు. ఈ సందర్భంగా సర్వే బృందాలు ఇక్కడికి చేరుకొని నాలుగు బృందాలుగా ఏర్పడి డిజిపిఎస్ రోవర్తో సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం రి సర్వే చేయమని చెప్పడంతో డీజిపిఎస్ టెక్నాలజీతోనే నిర్వహిస్తున్నామని, ప్రతిది క్షుణ్ణంగా శాటిలైట్ ద్వారా పాయింట్లు తీసుకోవడం జరిగింది. దీని పూర్తి మ్యాపు తయారు చేసిన తర్వాత దీంట్లో వచ్చిన చెరువు,కెనాల్ సాగుకు ఉపయోగపడని భూమి, ఉపయోగపడే భూమి ఎంత ఉన్నది అనేది దాని మీద పూర్తి సమాచారం కొరకు ఈ సర్వే నిర్వహిస్తున్నాం అని,రైతులు ఎలాంటి ఇబ్బందులు పెట్టకుండా సర్వేకు సహకరిస్తున్నారని తెలిపారు.

## సమన్వయంతో పనిచేయండి

**హైదరాబాద్, సెప్టెంబర్ 18 :**

రాష్ట్రంలో ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌ను విజయవంతంగా నిర్వహించేందుకు సమన్వయంతో కృషి చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అన్నారు. డిసెంబర్ 11 నుండి 22వ తేదీ వరకు జరిగే ఖేలో ఇండియా యువజన క్రీడల ఏర్పాట్లపై సచివాలయంలో శుక్రవారం ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సి.ఎస్ సంజయ్ జాజు మాట్లాడుతూ హైదరాబాద్‌తోపాటు హన్మకొండ, కరీంనగర్, నిజామాబాద్, మహబూబ్ నగర్, ఖమ్మం జిల్లాల్లో ఈ పోటీలను నిర్వహిస్తున్నామని తెలిపారు. 18 ఏళ్ల లోపు వయస్సు ఉన్న క్రీడాకారులు పాల్గొనే ఈ క్రీడా పోటీలు దేశంలో జాతీయ క్రీడల అనంతరం అంతే ప్రాధాన్యత ఉన్న పోటీలని, మొత్తం 27 ఈవెంట్స్‌లో దాదాపు 6,050 మంది క్రీడాకారులు పాల్గొంటారని వివరించారు. వీటిలో 14 వ్యక్తిగత క్రీడా విభాగాలు, 6 విభాగాలు టీమ్ ఈవెంట్లు, మరో ఆరు ఇతర క్రీడా ఈవెంట్లు ఉంటాయన్నారు. ఈ ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌ను విజయవంతంగా నిర్వహించేందుకు ముఖ్యమంత్రి చైర్మన్‌గా, క్రీడా శాఖ మంత్రి కోచైర్మన్‌గా మొత్తం 18 మందితోకూడిన ఆర్గనైజింగ్ కమిటీ ఏర్పాటు చేశామని వెల్లడించారు. దీంతోపాటు 28 మంది ఉన్నతాధికారులతో కూడిన ఎగ్జిక్యూటివ్ కమిటీ, మరో 18 ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేశామని సంజయ్ జాజు వెల్లడించారు. ఈ సమీక్షలో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, స్పోర్ట్స్ కార్పొరేషన్ ఎండీ సోని బాలాదేవి, కళాశాల, సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ దేవసేన, జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్, ఐటి శాఖ జాయింట్ సెక్రటరీ అనుదీప్ దురిశెట్టి, రైతు డిస్కమ్ ఎండీ ముషారఫ్ అలీ, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ తదితర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

# దానం నాగేందర్‌పై అనర్హత వేటు

**మొదటిపేజీ తరువాయి**

వారు వాదించారు. ఈ పిటిషన్లపై విచారణ అనంతరం స్పీకర్ నిర్ణయాన్ని హైకోర్టు తప్పుబట్టింది. ఆగస్టు 21న తీర్పును రిజర్వ్ చేసిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం.మొహియుద్దీన్‌ల ధర్మాసనం శుక్రవారం తీర్పు వెలువరించింది.

ఈ తీర్పుతో ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీ అయినట్లు స్పీకర్, ఎన్నికల సంఘానికి హైకోర్టు సమాచారం ఇచ్చింది. దీంతో రాష్ట్ర రాజకీయాల్లో ఈ వ్యవహారం కీలక పరిణామంగా మారింది.

**స్టేకు హైకోర్టు నిరాకరణ**

తీర్పు అమలుపై స్టే విధించి, సుప్రీంకోర్టులో అప్పీల్ చేసుకునేందుకు సమయం ఇవ్వాలని దానం నాగేందర్ తరఫు న్యాయవాదులు కోరారు. ఎమ్మెల్యేను వెంటనే పదవి నుంచి తొలగిస్తే నియోజకవర్గ ప్రజలకు ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని కోర్టుకు తెలిపారు. అయితే ఈ అభ్యర్థనను హైకోర్టు తిరస్కరించింది.

**తీర్పును స్వాగతించిన బీజేపీ**

దానం నాగేందర్ అనర్హతపై హైకోర్టు తీర్పును బీజేపీ స్వాగతించింది. ఒక పార్టీ తరఫున గెలిచి మరో పార్టీలో కొనసాగడాన్ని ప్రశ్నిస్తూ తాము న్యాయపోరాటం చేశామని బీజేపీఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. స్పీకర్ నిర్ణయాన్ని హైకోర్టు కొట్టివేయడం ప్రజాస్వామ్య పరిరక్షణలో కీలక పరిణామమన్నారు.

పార్టీ మారిన ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి ప్రజల తీర్పు కోరాలని కాంగ్రెస్‌ను ఆయన డిమాండ్ చేశారు. హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టుకు వెళ్లకుండా దాన్ని గౌరవించి వెంటనే రాజీనామా చేయాలని కోరారు. ప్రతివాదులు సుప్రీంకోర్టును ఆశ్రయించకుండా ఉండేందుకు బీజేపీ తరఫున కేవియట్ దాఖలు చేయనున్నట్లు మహేశ్వర్‌రెడ్డి తెలిపారు.

# మిగిలిన 8 మంది ఎమ్మెల్యేల సంగతేంటి?

**హైదరాబాద్, సెప్టెంబర్ 18:**

ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై తెలంగాణ హైకోర్టు అనర్హత వేటు వేయడంతో రాష్ట్ర రాజకీయాల్లో పార్టీ ఫిరాయింపుల అంశం మరోసారి తెరపైకి వచ్చింది. అయితే దానం కేసుతో పాటు కాంగ్రెస్‌లో చేరిన ఇతర బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై దాఖలైన అనర్హత పిటిషన్లపైనా ఇప్పుడు చర్చ మొదలైంది.

**దానం కేసు ప్రభావం ఎంత?**

మిగిలిన ఎనిమిది మంది ఎమ్మెల్యేల విషయంలోనూ దానం నాగేందర్‌కు వచ్చిన తీర్పే పునరావృతమవుతుందని ఇప్పుడే నిర్ధారించలేం. ఆయా కేసుల్లోని వాస్తవాలు, అందుబాటులో ఉన్న ఆధారాలు, పిటిషన్లలో చేసిన అభ్యర్థనలు, సంబంధిత ఎమ్మెల్యేల చర్యలను న్యాయస్థానం విడివిడిగా పరిశీలించాల్సి ఉంటుంది. అయితే దానం కేసులో హైకోర్టు తీర్పు రావడం వల్ల ఇతర ఫిరాయింపు కేసుల్లోనూ న్యాయపరమైన వాదనలకు కొత్త ప్రాధాన్యం ఏర్పడింది. దీంతో పెండింగ్‌లో ఉన్న పిటిషన్ల తదుపరి విచారణలు, వాటిపై న్యాయస్థానం తీసుకునే నిర్ణయాలపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి పెరిగింది.

**బీఆర్ఎస్ వాదన ఇదే**

దానం నాగేందర్‌పై వచ్చిన తీర్పు మిగిలిన ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసులపైనా ప్రభావం చూపుతుందని బీఆర్ఎస్ నేతలు చెబుతున్నారు. దీంతో కాంగ్రెస్‌లో చేరిన ఆ ఎనిమిది మంది ఎమ్మెల్యేలపై పెండింగ్‌లో ఉన్న అనర్హత పిటిషన్ల పరిస్థితి ఏమిటన్నది ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో కీలక చర్చగా మారింది.

## ఆర్టీసీలో గుర్తింపు సంఘం ఎన్నికలకు షెడ్యూల్

- **ఎనిమిదేళ్ల నిరీక్షణకు తెర.. ఈ నెల 21 నుంచి ఎన్నికల ప్రక్రియ**
- **అక్టోబర్ 9న పోలింగ్.. 17న ఫలితాల వెల్లడి**
- **అక్టోబర్ 26న తుది ఓటరు జాబితా విడుదల**
- **దాదాపు 48 వేల మంది ఉద్యోగులు ఓటు హక్కు వినియోగించుకోనున్నట్లు అంచనా**
- **వేతనాలు, డీఏ, బోనస్, ఉద్యోగ భద్రతపై యూనియన్ల ప్రచారం**
- **చివరిసారిగా 2016 జూలై 19న జరిగిన ఎన్నికలు**

**హైదరాబాద్, సెప్టెంబర్ 18:**

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్‌ఆర్టీసీ)లో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలకు ఎట్టకేలకు షెడ్యూల్ ఖరారైంది. ఎనిమిదేళ్లుగా ఎన్నికల కోసం ఎదురుచూస్తున్న కార్మికులకు మార్గం సుగమమైంది. కార్మిక శాఖ జాయింట్ డైరెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి నోటిఫికేషన్ విడుదల చేయడంతో ఈ నెల 21 నుంచే ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కానుంది. అక్టోబర్ 9న పోలింగ్ నిర్వహించనుండగా, అక్టోబర్ 17న ఫలితాలు ప్రకటించనున్నట్లు అధికారులు తెలిపారు. అక్టోబర్ 26న అన్ని జిల్లాల్లో తుది ఓటరు జాబితాను విడుదల చేయనున్నారు.

**గుర్తింపు సంఘాలకు కీలక హక్కులు**

ఆర్టీసీలో పలు కార్మిక సంఘాలు ఉన్నప్పటికీ ఎన్నికల్లో విజయం సాధించిన సంఘాలకే గుర్తింపు లభిస్తుంది. రీజియన్, రాష్ట్ర స్థాయిల్లో ఈ సంఘాలు కార్మికుల తరఫున వ్యవహరిస్తాయి. రెండు స్థాయిల ఎన్నికలకు వేర్వేరు బ్యాలెట్ పత్రాలను వినియోగిస్తారు. వేతనాలు, బోనస్, కరవు భత్యం (డీఏ), సర్వీస్ నిబంధనలు తదితర అంశాలపై యాజమాన్యం, ప్రభుత్వంతో చర్చలు జరిపే చట్టపరమైన హక్కు గుర్తింపు సంఘాలకు ఉంటుంది. కార్మికుల తరఫున ఒప్పందాలు కుదుర్చుకోవడంలోనూ ఇవే కీలకంగా వ్యవహరిస్తాయి. రీజియన్‌లోని అధికారి స్థాయి ఉద్యోగులను మినహాయించి మిగిలిన ఉద్యోగులు, కార్మికులందరికీ ఓటు హక్కు ఉంటుంది.

**ప్రధాన అజెండాగా కార్మిక సమస్యలు**

వాస్తవానికి గుర్తింపు సంఘం ఎన్నికలు 2018లోనే జరగాల్సి ఉన్నా అప్పట్లో నిర్వహించలేదు. ఈసారి దాదాపు 48 వేల మంది ఉద్యోగులు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఎన్నికల నేపథ్యంలో ఇప్పటికే పలు కార్మిక సంఘాలు ప్రచారాన్ని ముమ్మరం చేశాయి. వేతన సవరణ, ఉద్యోగ భద్రత, కార్మికుల సమస్యల పరిష్కారం తదితర అంశాలను ప్రధానంగా ప్రస్తావిస్తున్నాయి. ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు కార్మిక శాఖ ఏర్పాట్లు చేస్తోంది.

## మిగిలిన ఇళ్లను కూడా కేటాయించండి

**హైదరాబాద్, సెప్టెంబర్ 18 :**

పీఎంఏవై జీ పథకంలో భాగంగా మొదటి విడతగా రాష్ట్రానికి రెండు లక్షల ఇండ్లను కేటాయించినందుకు కేంద్ర వ్యవసాయ, గృహ నిర్మాణ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు కృతజ్ఞతలు తెలిపిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మిగిలిన 9.56 లక్షల ఇండ్లను కేటాయించాలని కోరారు. హైదరాబాద్ పర్యటనలో ఉన్న ఆయనను మాదాపూర్‌లో శుక్రవారం సీఎం కలిశారు. 1,56,915 అర్హులైన గ్రామీణ కుటుంబాలకు ఇండ్లు మంజూరు చేయాలని గత జూలైలో కేంద్ర మంత్రికి దిల్లీలో ముఖ్యమంత్రి వినతి పత్రం అందించారు. ప్రస్తుతం రెండు లక్షల ఇళ్లే కేటాయించినందున మిగిలిన ఇండ్లను కూడా కేటాయించాలని కోరారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంపై కేంద్ర మంత్రికి వివరిస్తూ వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో వ్యవసాయంలో విద్యుత్ వినియోగం పెరిగిందని తెలిపారు. తాగునీరు, విద్యుత్ కొరత తలెత్తకుండా రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసిందని వివరించారు. వ్యవసాయ రంగంలో ఎల్ నినో పరిస్థితులను ఎదుర్కొనేందుకు కేంద్రం నుంచి అవసరమైన సహకారం అందించాలని కోరారు. దేశంలో ఎక్కడా లేని విధంగా పేదలకు రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యాన్ని అందిస్తున్నామని, సన్న వడ్లకు రూ.500 బోనస్ అందించి ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. ఎల్‌నినో నేపథ్యంలో రాష్ట్రంలో ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులను ప్రోత్సహిస్తున్నామని సీఎం వివరించారు. 250 ఎకరాల్లో అంతర్జాతీయ ప్రమాణాలతో ఫ్రూట్స్, వెజిటబుల్ మార్కెట్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. పంట మార్పిడిపై రైతులను ప్రోత్సహించాల్సిన అవసరాన్ని గుర్తించి సహకరించాలని కేంద్ర మంత్రిని కోరారు. సీఎం వెంట మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ఇతర ఉన్నతాధికారులు ఉన్నారు.

## ఫార్ములా ఈ రేసుపై తప్పుడు కేసులు

**హైదరాబాద్, సెప్టెంబర్ 18:**

ఫార్ములా ఈ కార్ రేస్ నిర్వహణలో ఎలాంటి అవినీతి జరగలేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను అంతర్జాతీయ స్థాయిలో పెంచాలనే ఉద్దేశంతోనే రేస్ నిర్వహించామని తెలిపారు. ఈ వ్యవహారంలో తనపై తప్పుడు కేసులు పెట్టారని ఆరోపించారు. ఫార్ములా ఈ రేస్ కేసు విచారణలో భాగంగా నాంపల్లి ఏసీబీ కోర్టుకు హాజరైన ఆయన మీడియాతో మాట్లాడారు.

**న్యాయవ్యవస్థపై నమ్మకం**

కేసులకు తాము భయపడబోమని, న్యాయవ్యవస్థపై తమకు అపారమైన నమ్మకం ఉందని కేటీఆర్ అన్నారు. పోలీసులు ఎంత వేధించినా ప్రజాస్వామ్య పద్ధతిలో న్యాయవ్యవస్థ తమకు అండగా ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు. ఫార్ములా ఈ రేస్ కేసులో ఎప్పుడు విచారణకు పిలిచినా హాజరయ్యేందుకు సిద్ధంగా ఉన్నానని చెప్పారు.

**లక్ష కోట్ల ఆరోపణలపై సవాల్**

పక్క రాష్ట్రాలు తమ బ్రాండ్ ఇమేజ్‌ను పెంచుకునేందుకు అంతర్జాతీయ స్థాయిలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయని కేటీఆర్ అన్నారు. తమిళనాడు సీఎం విజయ్ ఫార్ములా ఈ రేస్ కోసం లండన్ వెళ్లారని పేర్కొన్నారు. ఇలాంటి ప్రయత్నాలు చేస్తున్న ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలో మాత్రం తప్పుడు కేసులు పెడుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యంగా కేసీఆర్‌ను పెట్టుకుని పనిచేస్తోందని ఆరోపించారు. తమపై లక్ష కోట్లు సంపాదించారంటూ అసత్య ప్రచారం చేస్తున్నారని అన్నారు. తమ పేరుతో లక్ష కోట్ల ఆస్తులు ఉంటే రూ.1,000 కోట్లు తీసుకుని, మిగిలిన రూ.99 వేల కోట్లను రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీల కోసం ఖర్చు చేయాలని రేవంత్‌రెడ్డికి సవాల్ విసిరారు. కాళేశ్వరం విషయంలో లక్ష కోట్లంటూ ప్రచారం చేసినట్టే ఇప్పుడు కూడా తమపై విషప్రచారం చేస్తున్నారని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

## నిరంకుశ నిజాం ఆదర్శమా?

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 18 :**

అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడిన మాటలు, బీఆర్ఎస్‌కాంగ్రెస్ నేతలు పరస్పరం చేసుకుంటున్న ఆరోపణలు చూస్తుంటే ఆ రెండు పార్టీల అసలు నైజం ఏమిటో ప్రజలు స్పష్టంగా గమనించాల్సిన అవసరం ఉందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు అన్నారు. దిల్లీలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో కేసీఆర్ పదేపదే నిజాంను మంచి పరిపాలకుడని, గొప్ప పనులు చేశాడని కీర్తిస్తే మొన్న అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి సైతం నిజాం చాలా గొప్ప మనిషంటూ పొగడ్తలతో ముంచెత్తడం ఈ రెండు పార్టీల వక్ర వైఖరికి నిదర్శనమని మండిపడ్డారు. నాడు నిజాం పాలనలో పల్లెల్లో కనీసం ఆడబిడ్డలు బతుకమ్మను కూడా ఆడుకోలేని పరిస్థితులు ఉండేవని గుర్తు చేశారు. జలియన్ వాలాబాగ్ తరహాలో పరకాల, జోడేఘాట్, గుండ్రాంపల్లి, వెయ్యి ఊడల మర్రి (నిర్మల్) వంటి అనేక ప్రాంతాల్లో ప్రజలను విచక్షణారహితంగా కాల్చి చంపిన రక్త చరిత్ర నిజాం సర్కారుదని అన్నారు. అలాంటి క్రూరమైన నిజాంను నేడు ప్రజాస్వామ్య పాలనలో ఇద్దరు ముఖ్యమంత్రులు ఆదర్శంగా తీసుకుంటున్నారంటే అంతకంటే దారుణం మరొకటి ఉండదని మండిపడ్డారు.

# 22ఏ భూముల వివాదాల పరిష్కారానికి హైలెవల్ కమిటీ

**మొదటిపేజీ తరువాయి**

శ్రీనివాస్‌రెడ్డి ఆదేశాల మేరకు ముగ్గురు సీనియర్ అధికారులతో కమిటీని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నిషేధిత జాబితాలో చేరిన భూములకు సంబంధించిన వివాదాలను పరిశీలించి, బాధితులకు పరిష్కారం చూపే విధంగా కమిటీ విధివిధానాలను రూపొందించనుంది.

**ముగ్గురు అధికారులతో కమిటీ**

సీసీఎల్ఏ కమిషనర్ లోకేష్ కుమార్ కమిటీకి చైర్మన్‌గా వ్యవహరించనున్నారు. పాపిరెడ్డి, రాజీవ్ గాంధీ హనుమంతు సభ్యులుగా ఉంటారు. 22ఏ జాబితాలో పొరపాటుగా చేరిన ప్రైవేట్ భూములు, నిషేధిత భూములకు సంబంధించిన ఇతర వివాదాలను పరిశీలించి తగిన పరిష్కార మార్గాలను కమిటీ సూచించనుంది.

**భూముల వివరాలపై సీఎం ఆరోపణలు**

రాష్ట్రంలో అటవీ, అసైన్డ్, దేవాదాయ శాఖలకు చెందిన 1.02 కోట్ల ఎకరాలు 22ఏ నిషేధిత జాబితాలో ఉన్నాయని సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల అసెంబ్లీలో పేర్కొన్నారు. వీటిని తొలగించే అధికారం మంత్రులకు కూడా లేదని స్పష్టం చేశారు. నిజాం కాలం నుంచి కొనసాగుతున్న భూ సమస్యలపై సమగ్రంగా చర్చించాల్సిన అవసరం ఉందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ధరణి పోర్టల్ ద్వారా 2.50 కోట్ల ఎకరాల భూముల వివరాలు విదేశీ మాఫియా చేతుల్లోకి వెళ్లాయని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. ప్రభుత్వ భూములను రిజిస్ట్రేషన్ చేయడం, అధికారుల పొరపాట్లతో ప్రైవేట్ భూములు 22ఏ జాబితాలో చేరడం వల్ల సమస్యలు ఏర్పడ్డాయని తెలిపారు.

**కల్వకుంట్ల కుటుంబ భూములపైనా వ్యాఖ్యలు**

22ఏ జాబితాలో 12 అంశాలను గుర్తించామని, సభ్యుల సూచనల ఆధారంగా పేదలకు న్యాయం చేస్తామని సీఎం తెలిపారు. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిపై బీఆర్ఎస్ నేతలు అసత్య ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. తెలంగాణ ఉద్యమకారులు నష్టపోతే కేసీఆర్ కుటుంబం మాత్రం వేల కోట్లు, వందల ఎకరాల ఆస్తులు సంపాదించిందని రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. కల్వకుంట్ల కుటుంబం, వారి బంధువుల పేరిట తొమ్మిది జిల్లాల్లో ఉన్న 439.30 ఎకరాల భూముల వివరాలను సర్వే నంబర్లతో సహా అసెంబ్లీలో వెల్లడించారు. ఎర్రవల్లి ఫాంహౌస్ భూముల్లో ప్రభుత్వ భూములతో పాటు రైతుల నుంచి తీసుకున్న భూములు ఉన్నాయనే ఆరోపణలపై 30 రోజుల్లో విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని సిద్దిపేట కలెక్టర్‌ను ఆదేశించినట్లు తెలిపారు.

దీనిపై కేటీఆర్, హరీశ్‌రావు స్పందిస్తూ రేవంత్‌రెడ్డి కుటుంబం పేరిట కూడా వందల ఎకరాల భూములు ఉన్నాయని ఆరోపించారు. వాటికి సంబంధించిన వివరాలను త్వరలోనే ప్రజల ముందుంచుతామని వారు ప్రకటించారు.

# సభను అగౌరవపరిచిన బీఆర్ఎస్

- శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్ బాబు
- సమావేశాలకు రాకూడదనే ఉద్దేశంతోనే నిబంధనల ఉల్లంఘన
- స్పీకర్ ను దూషించడం అప్రజాస్వామికం
- మాక్ అసెంబ్లీ దుర్మార్గమైన చర్య
- భూకబ్జాలపై హైపవర్ కమిటీ... నెల రోజుల్లో నివేదిక
- నిరవధికంగా వాయిదా పడిన అసెంబ్లీ

హైదరాబాద్, సెప్టెంబర్ 18:

శాసనసభ సమావేశాలకు హాజరయ్యే ఉద్దేశం లేకనే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఉద్దేశపూర్వకంగా సభా నియమాలను ఉల్లంఘించారని రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు మండిపడ్డారు. సభ సజావుగా సాగకూడదన్న కుట్రతోనే వారు ఆటంకాలు సృష్టించారని విమర్శించారు. ఎనిమిది రోజుల పాటు జరిగిన అసెంబ్లీ సమావేశాలు శుక్రవారంనిరవధికంగా వాయిదా పడిన అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు. టీ షర్టులపై స్లోగన్స్ రాసుకుని రావడం నిబంధనలకు విరుద్ధమని తెలిసీ కేవలం ప్రచారం కోసం బీఆర్ఎస్ నేతలు సభా సంప్రదాయాలను తుంగలో తొక్కారని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో వారి ప్రభుత్వ హయాంలోనే ప్లకార్డులు, స్లోగన్స్‌తో సభలోకి రాకూడదని అప్పటి స్పీకర్ రూలింగ్ ఇచ్చారని, కొత్త రూల్స్ తెచ్చారని గుర్తుచేశారు. ఆ విషయం తెలిసి కూడా సభా మర్యాదను మంటగలిపారని దుయ్యబట్టారు. శాసనసభ జరుగుతుండగానే బయట మాక్ అసెంబ్లీ నిర్వహించడం సభ గౌరవాన్ని అవహేళన చేయడమేనని, ఇది అత్యంత దుర్మార్గమైన చర్య అని మంత్రి అన్నారు. నెల రోజులు సభ నిర్వహించాలని కేటీఆర్ కోరడం ఉత్త మాటలే అని తేలిపోయిందన్నారు. ఎంతో అనుభవం ఉన్న నాయకులు స్పీకర్ పోడియం వద్దకు దూసుకెళ్లి ఆందోళన చేయడం కరెక్ట్ కాదన్నారు. స్పీకర్‌ను దూషించడం అప్రజాస్వామికమని, ఈ ఘటన యావత్ తెలంగాణ సమాజం చూసిందని, ఇది స్పీకర్‌ను తీవ్ర మనస్తాపానికి గురిచేసిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

**భూకబ్జాలపై హైపవర్ కమిటీ**

భూముల ఆక్రమణల వ్యవహారంపై విచారణ జరిపేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైపవర్ అధికారులతో కూడిన ఓ కమిటీని వేశారని శ్రీధర్ బాబు వెల్లడించారు. ఈ కమిటీ నెల రోజుల వ్యవధిలో 12 కీలక అంశాలపై దర్యాప్తు జరిపి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తుందని, ఆ నివేదిక ఆధారంగా కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు.

**విజయవంతంగా ముగిసిన సమావేశాలు**

ఈ నెల 7న ప్రారంభమైన శాసనసభ సమావేశాలు 18వ తేదీ వరకు విజయవంతంగా జరిగాయని, ప్రజా సంక్షేమ పథకాలకు సంబంధించిన అనేక అంశాలపై సుదీర్ఘ చర్చ జరిగిందని మంత్రి తెలిపారు. సభలో ప్రతి ఒక్కరికీ మాట్లాడే అవకాశం కల్పించామన్నారు. మొత్తం పని దినాలు: 8 రోజులు, సభ జరిగిన సమయం: 51 గంటల 52 నిమిషాలు మౌఖిక సమాధానాలు (మంత్రుల ద్వారా): 50. సమాధానం ఇచ్చిన స్టార్డ్ ప్రశ్నలు: 9 సమాధానం ఇచ్చిన అన్‌స్టార్డ్ ప్రశ్నలు: 1 సభ్యులు అడిగిన సప్లిమెంటరీ ప్రశ్నలు: 86 సభ్యుల ప్రసంగాలు: 105, మంత్రులు చేసిన ప్రకటనలు: 2, ఆమోదం పొందిన ప్రభుత్వ తీర్మానాలు: 3, సభలో ఆమోదం పొందిన బిల్లులు: 4, స్వల్పకాలిక చర్చలు: 4 సమాధానాలు అందని ప్రశ్నలు: స్టార్డ్ - 62, అన్‌స్టార్డ్ - 22 అని మంత్రి తెలిపారు

# మిల్లర్ల సమస్యలకు సానుకూల పరిష్కారం

- మంత్రివర్గ ఉప సంఘంతో రైస్ మిల్లర్ల ప్రతినిధుల భేటీ
- రైతుల ప్రయోజనాలు-ప్రజాధన పరిరక్షణతో మిల్లింగ్ రంగానికి భరోసా
- మిల్లర్లను ప్రత్యర్థులుగా కాదు.. భాగస్వాములుగా చూస్తాం
- పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్ 18 :

రైస్ మిల్లర్లు సమ్మెకు దిగిన నేపథ్యంలో నెలకొన్న పరిస్థితికి సామరస్యపూర్వక పరిష్కారం కనుగొనే దిశగా ప్రభుత్వం కీలక అడుగు వేసింది. అసెంబ్లీ ప్రాంగణంలో మంత్రివర్గ ఉప సంఘం, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధుల మధ్య శుక్రవారం జరిగిన సమావేశం అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంది. పరస్పర విశ్వాసం, సహృద్భావ వాతావరణంలో జరిగిన ఈ చర్చల్లో మిల్లర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం సావధానంగా విని నిబంధనల పరిధిలో సానుకూల పరిష్కారం చూపేందుకు సంసిద్ధత వ్యక్తం చేసింది. నీటిపారుదల, పౌర సరఫరాల శాUల మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, పరిశ్రమలుఐటీ శాU మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, డైరెక్టర్ శ్యామ్ ప్రసాద్, అదనపు డైరెక్టర్ రోహిత్ పాల్గొన్నారు. రైస్ మిల్లర్స్ అసోసియేషన్ తరఫున తూడి దేవేందర్ రెడ్డి, గంప నాగేందర్, మోహన్ రెడ్డి, గణపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు. పెనాల్టీలు, టెండర్ ధాన్యం ధరలు, స్టాక్ వ్యత్యాసాలు, సరఫరా గడువు పొడిగింపు, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న ఇతర ఇబ్బందులను మిల్లర్ల ప్రతినిధులు మంత్రివర్గ ఉపసంఘం దృష్టికి తీసుకొచ్చారు. వారి అభ్యంతరాలు, ఆందోళనలను మంత్రులు ఓపికగా విని అంశాలవారీగా అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ మిల్లర్లను ప్రభుత్వం ప్రత్యర్థులుగా కాక ధాన్యం కొనుగోలుమిల్లింగ్ వ్యవస్థలో కీలక భాగస్వాములుగా చూస్తోందని స్పష్టం చేశారు. ఈ అంశానికి రాజకీయాలతో సంబంధం లేదని, రైతులు, ప్రభుత్వం, మిల్లర్లు ఒకే వ్యవస్థలో భాగస్వాములనే భావనతో సమస్యను పరిష్కరించాలని సూచించారు. మిల్లర్ల వినతులను సానుకూల దృక్పథంతో పరిశీలిస్తాం.. ప్రభుత్వ పరిధిలో ఏమి చేయగలమో అన్ని కోణాల్లో ఆలోచిస్తాం.. మిల్లర్లపై అనవసరమైన భారం మోపాలన్న ఉద్దేశం ప్రభుత్వానికి లేదు.. అదే సమయంలో రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం చేసిన వాస్తవ వ్యయాన్ని, ప్రజాధనాన్ని విస్మరించలేం అని మంత్రి పేర్కొన్నారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసేందుకు పౌర సరఫరాల సంస్థ బ్యాంకుల నుంచి అప్పులు తీసుకుంటోందని, ఆ నిధులతో రైతులకు కనీస మద్దతు ధర చెల్లించి ధాన్యాన్ని మిల్లర్లకు అప్పగిస్తున్నామని వివరించారు. రైతులకు చెల్లించిన కనీస మద్దతు ధరతో పాటు బ్యాంకులకు చెల్లిస్తున్న వడ్డీని కూడా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుందన్నారు. టెండర్ ధాన్యం ధర రెండు నెలల క్రితం నిర్ణయించినది కావచ్చు.. కానీ ఆ తర్వాత కూడా పౌర సరఫరాల సంస్థ బ్యాంకులకు నిరంతరంగా వడ్డీ చెల్లిస్తూనే ఉంది.. రైతులకు చెల్లించిన మద్దతు ధర, దానిపై ప్రభుత్వం భరించిన వడ్డీ కంటే తక్కువ ధరను నిర్ణయించడం సాధ్యం కాదు.. ప్రభుత్వం ఖర్చు చేసిన వాస్తవ మొత్తాన్ని తిరిగి రాబట్టుకోవడమే తమ ఉద్దేశం.. అంతకు మించి మిల్లర్లపై భారం వేయాలన్న ఆలోచన లేదు అని మంత్రి ఉత్తమ్ స్పష్టం చేశారు. ప్రస్తుతం మిల్లర్లు ప్రస్తావిస్తున్న పెనాల్టీలను గత ప్రభుత్వం విధించిందని మంత్రి గుర్తు చేశారు. అయితే అవి గత ప్రభుత్వ నిర్ణయాలంటూ సమస్యను పక్కన పెట్టబోమని, మిల్లర్ల ప్రస్తుత ఇబ్బందులను సానుకూల దృక్పథంతో పరిశీలిస్తామని భరోసా ఇచ్చారు. ఏడాది, రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న సరఫరాల కారణంగా పౌర సరఫరాల సంస్థపై వడ్డీ భారం పెరిగిన విషయాన్ని కూడా మిల్లర్లు అర్థం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వానికి, మిల్లర్లకు మధ్య ఎవరికీ వ్యక్తిగత ప్రయోజనాలు లేవని, రైతుల సంక్షేమం, ప్రజాధన పరిరక్షణ, మిల్లింగ్ రంగం స్థిరత్వం అనే మూడు లక్ష్యాల మధ్య సమతుల



పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయమని స్పష్టం చేశారు. సమస్య పరిష్కారంపై ప్రభుత్వం పూర్తి చిత్తశుద్ధితో ముందుకొస్తున్నందున మిల్లర్లు సమ్మెను విరమించి నాలుగైదు రోజుల సమయం ఇవ్వాలని మంత్రి కోరారు. ఈ వ్యవధిలో పౌర సరఫరాల శాఖ కమిషనర్ ఆధ్వర్యంలో అధికారులు మిల్లర్ల వినతులను, ప్రభుత్వ వాస్తవ వ్యయాన్ని, నిబంధనల పరిధిలో అందుబాటులో ఉన్న పరిష్కార మార్గాలను సమగ్రంగా పరిశీలించాలని సూచించారు. అధికారుల స్థాయిలో ప్రాథమిక కసరత్తు పూర్తయిన తరువాత మిల్లర్ల ప్రతినిధులతో మరోసారి సమావేశమై తుది నిర్ణయానికి రావాలని సమావేశంలో నిర్ణయించారు. సమస్యను సాగదీయకుండా, ఏకపక్ష నిర్ణయాలకు తావివ్వకుండా, పరస్పర ఆమోదయోగ్యమైన పరిష్కారాన్ని సాధించాలన్న సంకల్పాన్ని ప్రభుత్వం వ్యక్తం చేసింది.

# ఎల్‌నినో అధిగమించేందుకు ముందస్తు కార్యాచరణ

హైదరాబాద్, సెప్టెంబర్ 18 :

పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడిన ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో తీవ్ర వర్షపాతం లోటు, జలాశయాల్లో నీటి ప్రవాహం తగ్గడం, విద్యుత్ డిమాండ్ పెరగడం వంటి సవాళ్లు ఎదురయ్యాయని, అయితే ప్రభుత్వం ఏప్రిల్ నుంచే ముందస్తు చర్యలు చేపట్టి పరిస్థితులను విజయవంతంగా నియంత్రిస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క శాసనసభలో స్పష్టం చేశారు. సమస్య తలెత్తిన తర్వాత స్పందించడం కాకుండా, నష్టం జరగక ముందే అప్రమత్తమై వివిధ శాఖల సమన్వయంతో ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్తున్నామని వివరించారు. ఈ ఏడాది జూన్, జూలై నెలల్లోనే కాక, ఆగస్టులో ఏకంగా 38 శాతం వర్షపాతం లోటు నమోదైందని డిప్యూటీ సీఎం తెలిపారు. వర్షాభావ పరిస్థితుల వల్ల వానాకాలం సాగు విస్తీర్ణం గత ఏడాది 139.29 లక్షల ఎకరాల నుంచి ఈ ఏడాది 123.74 లక్షల ఎకరాలకు తగ్గింది. వరి సాగు సుమారు 18 శాతం తగ్గింది. తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటలు, పంటల వైవిధ్యీకరణపై 1,600 గ్రామాల్లో 2 లక్షలకు పైగా రైతులకు అవగాహన కల్పించాం. 32 జిల్లాలకు ప్రత్యేక ఎల్‌నినో వ్యవసాయ కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాం. నిపుణుల సలహాలతో 27 మంది సభ్యుల కమిటీని ఏర్పాటు చేసి క్షేత్రస్థాయి అధికారులను, రైతులను నిరంతరం అప్రమత్తం చేస్తున్నాం.

**రాబోయే 12 నెలలకు తాగునీటి భద్రతే లక్ష్యంగా..**

రాష్ట్రవ్యాప్తంగా ప్రాజెక్టుల మొత్తం సామర్థ్యం 808 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 465 టీఎంసీల నీరు మాత్రమే అందుబాటులో ఉందన్నారు. రాబోయే 11-12 నెలల తాగునీటి అవసరాలకు నీటిని కేటాయించిన తర్వాతే ఇతర అవసరాలకు వినియోగిస్తాం. కల్వకుర్తి, నెట్టెంపాడు, దేవాదుల, కోయిల్ సాగర్, భీమా తదితర ఎత్తిపోతల పథకాల ద్వారా చెరువులు, రిజర్వాయర్లను నింపుతున్నాం. సింగూరు, మంజీరా జలాశయాల్లో నీటిమట్టాలను నిరంతరం పర్యవేక్షిస్తూ, హైదరాబాద్ సహా చుట్టుపక్కల ప్రాంతాలకు మిషన్ భగీరథ, కృష్ణా, గోదావరి వనరుల నుంచి ప్రత్యామ్నాయంగా నీటి సరఫరాకు ఏర్పాట్లు చేశాం.

**'తెలంగాణ జలసిరి'**

పడే ప్రతి వర్షపు చుక్కను నిల్వ చేసేందుకు 24 లక్షల ఇంకుడు గుంతలు, 50 వేల వ్యవసాయ కుంటలు, 12 వేల పర్కొలేషన్ ట్యాంకులు, 12 వేల బోరు బావుల రీచార్జ్ నిర్మాణాలను చేపట్టాలని నిర్ణయించాం.

**చరిత్రలో రికార్డు విద్యుత్ డిమాండ్**

వర్షాలు తగ్గుముఖం పట్టడంతో వ్యవసాయ బోరు బావుల వాడకం పెరగడం, ఎత్తిపోతల పథకాల లోడ్ భారీగా పెరగడం వల్ల విద్యుత్ డిమాండ్ తీవ్రస్థాయికి చేరిందని తెలిపారు. సెప్టెంబర్ 9న ఉదయం 10.41 గంటలకు రాష్ట్ర చరిత్రలోనే అత్యధికంగా 19,543 మెగావాట్ల గరిష్ఠ విద్యుత్ డిమాండ్ నమోదైంది. గత ఏడాదితో పోలిస్తే దాదాపు 4,000 మెగావాట్ల అదనపు భారం పడింది. జలవిద్యుత్ ఉత్పత్తి తగ్గిపోయినప్పటికీ, థర్మల్ కేంద్రాల ఉత్పత్తి పెంచడం, సింగరేణి బొగ్గు కేటాయింపులను సమర్థంగా వాడుకోవడం, మార్కెట్ కొనుగోళ్ల ద్వారా విద్యుత్‌ను సమీకరించి రైతులకు, గృహాలకు, పరిశ్రమలకు ఎలాంటి అంతరాయం లేని సరఫరాను అందించాం.

**గ్రామీణ ఉపాధి – ప్రజారోగ్యంపై నిఘా**

వర్షాభావ సమయంలో గ్రామీణ జీవనోపాధులను కాపాడేందుకు 2026-27 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు 7.3 కోట్ల పని దినాలను సృష్టించి, ₹2,100.53 కోట్ల వేతనాలను నేరుగా కూలీల ఖాతాల్లో జమ చేశాం. ఎల్‌నినో వల్ల పెరిగే ఉష్ణోగ్రతల దృష్టియా వేడిగాలుల హెచ్చరికలు జారీ చేయడం, తాగునీటి ఏర్పాట్లు, కూలింగ్ కేంద్రాలు, అంగన్‌వాడీల ద్వారా పోషకాహార పంపిణీకి చర్యలు తీసుకున్నాం. ఈ ఏడాది 6.18 కోట్ల మొక్కల లక్ష్యానికి గాను ఇప్పటికే 5.91 కోట్ల మొక్కల నాటే ప్రక్రియను, పంపిణీని పూర్తి చేశాం. ప్రకృతి విపత్తులను ఆపడం సాధ్యం కాకపోయినా, ప్రభుత్వ ముందస్తు చర్యలు, వివిధ శాఖల సమన్వయంతో ప్రజలను, రైతాంగాన్ని ఆదుకోవడమే తమ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.



**లోటు వర్షపాతం.. అడుగంటిన జలాశయాలు**

2026 నైరుతి రుతుపవనాల కాలంలో ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో తీవ్ర వర్షాభావం ఏర్పడింది. జూన్ 1 నుండి సెప్టెంబర్ 16 వరకు సాధారణ వర్షపాతం 664.5 మి.మీ. నమోదు కావాల్సి ఉండగా, కేవలం 536.5 మి.మీ. మాత్రమే నమోదై 20 శాతం లోటు ఏర్పడింది. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో 19 జిల్లాలు తీవ్ర వర్షాభావ కేటగిరీలో ఉన్నాయి. వర్షభావం వల్ల పంటల సాగు విస్తీర్ణం తీవ్రంగా పడిపోయింది. సాధారణ సాగు విస్తీర్ణం 139.29 లక్షల ఎకరాలు కాగా, కేవలం 88 శాతం విస్తీర్ణంలోనే సాగైంది. ముఖ్యంగా వరి సాగు విస్తీర్ణం 18 శాతం తగ్గింది. సరిపడా నీరు లేక విత్తనాలు మొలకెత్తకపోవడంతో రైతులు పలుమార్లు విత్తనాలు వేయాల్సి వచ్చి పెట్టుబడి భారం రెట్టింపైంది. మరోవైపు రాష్ట్రంలోని ప్రధాన జలాశయాల మొత్తం సామర్థ్యం 585 టీఎంసీలు కాగా, ప్రస్తుతం కేవలం 241 టీఎంసీల లైవ్ స్టోరేజ్ మాత్రమే అందుబాటులో ఉంది. గత ఏడాది ఇదే సమయానికి 497 టీఎంసీల నీటి నిల్వలు ఉండడం గమనార్హం. ఉన్న నీటిని తాగునీటి అవసరాలకే రిజర్వు చేయాల్సి రావడంతో రాబోయే యాసంగి పంటలకు సాగునీటి కొరతతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తే అవకాశముందని సభ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది.

**కేంద్రానికి శాసనసభ కోరిన ప్రధాన డిమాండ్లు:**

క్షేత్రస్థాయి పరిస్థితులను అంచనా వేయడానికి కేంద్ర బృందాన్ని వెంటనే పంపించాలి. జాతీయ విపత్తు ప్రతిస్పందన నిధి (నుంచి నిధులు మంజూరు చేయడంతోపాటు SDRFలో కేంద్ర వాటాను వెంటనే విడుదల చేయాలి. తాగు, సాగునీటి అవసరాలు, చెరువులు, జలవనరుల పునరుజ్జీవనం మరియు నిర్మాణంలో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేయడానికి ₹20 వేల కోట్ల ప్రత్యేక నిధులు కేటాయించాలి. వీబీజీ రాంజీ పథకం కింద ఇచ్చే 125 రోజుల ఉపాధికి అదనంగా మరో 50 రోజులు పెంచి, మొత్తం వ్యయాన్ని కేంద్ర ప్రభుత్వమే భరించాలి.

**రాష్ట్రానికి ₹20,000 కోట్ల ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలి**

-కేంద్రానికి తెలంగాణ అసెంబ్లీ విజ్ఞప్తి
రాష్ట్రంలో ఎల్‌నినో పరిస్థితుల వల్ల తలెత్తిన తీవ్ర వర్షాభావం, పంటల నష్టం, తాగు మరియు సాగు నీటి ఎద్దడి నుంచి రైతులను, గ్రామీణ ప్రజలను ఆదుకోవడానికి కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించాలని తెలంగాణ శాసనసభ ఏకగ్రీవంగా తీర్మానించింది. రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులు, కరువు నివారణ చర్యల కోసం ₹20,000 కోట్ల ప్రత్యేక సహాయ ప్యాకేజీని మంజూరు చేయాలని కోరుతూ సభ తీర్మానాన్ని ఆమోదించింది.

# దానం అనర్హత తీర్పుతో కాంగ్రెస్ ద్వంద్వ వైఖరి బట్టబయలు

- హైకోర్టు తీర్పు స్పీకర్ వ్యవహారశైలిపై ప్రశ్నలు లేవనెత్తింది
- ప్రజల తీర్పును కాంగ్రెస్ ప్రభుత్వం గౌరవించలేదని హరీశ్‌రావు విమర్శ
- పార్టీ ఫిరాయింపులపై రాహుల్ గాంధీ హామీలను గుర్తుచేసిన మాజీ మంత్రి
- ఫిరాయింపు ఎమ్మెల్యేలతో వెంటనే రాజీనామా చేయించాలని డిమాండ్
- కొత్తగా ప్రజా తీర్పు కోరేలా సీఎం రేవంత్‌రెడ్డిని ఆదేశించాలని సూచన

హైదరాబాద్, సెప్టెంబర్ 18:

ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హత కేసులో తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పు కాంగ్రెస్ ప్రభుత్వ ద్వంద్వ వైఖరిని స్పష్టం చేసిందని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు విమర్శించారు. కాంగ్రెస్, ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ రాజ్యాంగ పరిరక్షణ విషయంలో అనుసరిస్తున్న తీరుపై ఎక్స్ వేదికగా ప్రశ్నలు సంధించారు.

**ప్రజా తీర్పును విస్మరించారని ఆరోపణ**

దానం నాగేందర్ బీఆర్ఎస్ అభ్యర్థిగా గెలిచి అనంతరం కాంగ్రెస్‌లో చేరారని హరీశ్‌రావు గుర్తుచేశారు. కాంగ్రెస్ తరపున లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసిన సమయంలోనూ ఎమ్మెల్యే పదవిలో కొనసాగారని పేర్కొన్నారు. ప్రజలు ఇచ్చిన తీర్పు పవిత్రతను కాపాడాల్సిన బాధ్యతను విస్మరించి, స్పీకర్ నిర్ణయం ద్వారా ఆయనకు రక్షణ కల్పించే ప్రయత్నం జరిగిందని ఆరోపించారు. ఈ వ్యవహారంలో హైకోర్టు జోక్యం చేసుకోవడం కాంగ్రెస్ ప్రభుత్వానికి తీరని మచ్చగా మిగిలిందన్నారు.



**రాహుల్ హామీపై నిలదీత**

2024 ఎన్నికల మేనిఫెస్టోలో పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన ప్రజాప్రతినిధులపై స్వయంచాలకంగా అనర్హత వేటు పడేలా పదో షెడ్యూల్‌ను సవరించాలని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని హరీశ్‌రావు గుర్తుచేశారు. రాజ్యాంగ పరిరక్షణ గురించి దేశవ్యాప్తంగా మాట్లాడుతున్న రాహుల్ గాంధీకి, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ఫిరాయింపులు జరిగినప్పుడు అదే నిబద్ధత ఎందుకు కనిపించడం లేదని ప్రశ్నించారు. రాజకీయ అవసరాలకు అనుగుణంగా రాజ్యాంగంపై వైఖరి మారుతోందా అని నిలదీశారు.

**ఇతర ఫిరాయింపు ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్**

హైకోర్టు తీర్పు నేపథ్యంలో పార్టీ మారిన ఇతర ఎమ్మెల్యేలపై పెండింగ్‌లో ఉన్న అనర్హత పిటిషన్లను స్పీకర్ చట్ట ప్రకారం పరిష్కరించాలని హరీశ్‌రావు కోరారు. కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలతో వెంటనే రాజీనామా చేయించి, తిరిగి ప్రజల తీర్పు కోరేలా సీఎం రేవంత్‌రెడ్డిని రాహుల్ గాంధీ ఆదేశించాలని డిమాండ్ చేశారు.

# ఎల్‌నినో ప్రభావాన్ని ముందుగానే గుర్తించాం

- సాగు, తాగునీరు, పశుసంపద, విద్యుత్ రంగాలపై ప్రత్యేక దృష్టి
- 17 జిల్లాల్లో 20 నుంచి 46 శాతం వరకు తక్కువ వర్షపాతం
- ఎల్‌నినోపై చర్చలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి

హైదరాబాద్, సెప్టెంబర్ 18 :

ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షపాతం లోటు ఏర్పడే అవకాశం ఉందని ముందుగానే గుర్తించిన ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో అన్ని రంగాలపై ముందస్తు ప్రణాళికతో పనిచేస్తోందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. శాసనసభలో ఎల్‌నినోపై శుక్రవారం జరిగిన స్వల్పకాలిక చర్చలో ఆయన మాట్లాడారు. ఎల్‌నినో గతంలో 1951, 1965, 1972, 1982, 1987, 2002, 2015 సంవత్సరాల్లో వచ్చినప్పటికీ ఈసారి మాత్రం చాలా క్లిష్టమైన పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. దీని ప్రభావం వల్ల కొన్ని జిల్లాల్లో సాధారణ వర్షపాతం కంటే గణనీయమైన లోటు నమోదవుతోందని తెలిపారు ఈ నెల 10 వరకు నమోదైన వివరాల ప్రకారం యాదాద్రి భువనగిరిలో 21 శాతం, హైదరాబాద్‌లో 22 శాతం, మెదక్‌లో 23 శాతం, వికారాబాద్‌లో 26 శాతం, మేడ్చల్‌మల్కాజిగిరిలో 28 శాతం, జనగామలో 30 శాతం, ఆదిలాబాద్‌లో 31 శాతం, మహబూబ్‌నగర్‌లో 32 శాతం, భద్రాద్రి కొత్తగూడెం, నల్గొండలో 33 శాతం, సూర్యాపేటలో 34 శాతం, వరంగల్, ఖమ్మంలో 37 శాతం, నారాయణపేటలో 38 శాతం, నాగర్‌కర్నూల్‌లో 39 శాతం, వనపర్తిలో 41 శాతం, హనుమకొండలో 42 శాతం, జోగులాంబ గద్వాలలో 46 శాతం వరకు సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదైందని కొన్ని మండలాల్లో ఒకేసారి క్లౌడ్ బరస్ట్ జరిగిందని వివరించారు. ఒక నెలలో పడాల్సిన వర్షం ఒక గంటలో కురిస్తే రికార్డులలో వర్షపాతం నమోదైనా వాస్తవానికి ఆ నీరు ప్రజలకు ఉపయోగపడదని వివరించారు.

**ముఖ్యమంత్రి స్థాయిలో ముందస్తు సమీక్షలు**

ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో పెట్టుకుని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇప్పటికే ఉన్నత స్థాయి సమీక్షలు నిర్వహించారని, తక్కువ వర్షపాతం పరిస్థితుల్లో రైతులు ఏ పంటలు సాగు చేయాలి, అందుబాటులో ఉన్న నీటిని ఎలా వినియోగించుకోవాలి అనే అంశాలపై వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులతో మండలాలు, ప్రధాన గ్రామాల వారీగా సమీక్షలు నిర్వహించారని చెప్పారు. జూలై 17న జరిగిన కేబినెట్ సమావేశంలో ఎల్‌నినో ప్రభావం, దాని వల్ల రాబోయే పరిణామాలపై సుదీర్ఘంగా చర్చించి కీలక నిర్ణయాలు తీసుకున్నామని మంత్రి తెలిపారు. కేబినెట్ నిర్ణయాలకు అనుగుణంగా ఉమ్మడి జిల్లాల ఇన్‌చార్జి మంత్రులు ఆయా జిల్లాల్లో ఉన్నత స్థాయి సమీక్షలు నిర్వహించి, స్థానిక పరిస్థితులకు అనుగుణంగా నష్ట నివారణ చర్యలు చేపట్టారని చెప్పారు.



**33 లక్షల పంప్‌సెట్లకు నిరంతర విద్యుత్**

వర్షాభావ పరిస్థితుల్లో పంటలను కాపాడుకునేందుకు రైతులు బోర్లపై ఆధారపడుతున్నారని, రాష్ట్రవ్యాప్తంగా సుమారు 33 లక్షల పంప్‌సెట్లు పనిచేస్తున్నాయని మంత్రి తెలిపారు. దీంతో విద్యుత్ వినియోగం అనూహ్యంగా పెరిగిందన్నారు. సెప్టెంబర్ 9న రాష్ట్ర విద్యుత్ డిమాండ్ సుమారు 19,575 మెగావాట్లకు చేరిందని, ఇలాంటి పరిస్థితుల్లోనూ రైతులకు విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూడటానికి ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలో ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని తెలిపారు.

**పశుసంపదపైనా ప్రత్యేక దృష్టి**

ఎల్‌నినో ప్రభావం కేవలం వ్యవసాయం, తాగునీటికే పరిమితం కాదని, పశుసంపదపైనా ప్రభావం చూపే అవకాశం ఉందని మంత్రి అన్నారు. పశువులకు మేత, నీటి లభ్యత విషయంలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా దీర్ఘకాలిక ప్రణాళికలు సిద్ధం చేయాలని కేబినెట్‌లోనే పశుసంవర్ధక, వ్యవసాయ శాఖలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు ఇచ్చారని తెలిపారు.

**కేంద్రం నుంచి సహకారం అవసరం**

ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలా సహకరించాలని మంత్రి కోరారు. ఇప్పటికే రాష్ట్ర కేబినెట్ కేంద్ర సహకారం కోరుతూ తీర్మానం చేసిందని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వ పెద్దల దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్లారని తెలిపారు. ప్రజలను ఎల్‌నినో ప్రభావం నుంచి కాపాడేందుకు ప్రభుత్వం తన వంతు బాధ్యతగా ముందస్తు చర్యలు తీసుకుంటోందని, కేంద్రం కూడా అన్ని రంగాల్లో రాష్ట్రానికి పూర్తి సహకారం అందించాలని మంత్రి పొంగులేటి కోరారు. రాజకీయాలకు అతీతంగా ప్రజల ప్రయోజనాల కోసం అందరూ కలిసి పనిచేయాల్సిన సమయం ఇదేనని పేర్కొన్నారు.

# మొదట ఓటు చోరీ.. ఇప్పుడు పార్టీ చోరీ!

- ఎన్నికల సంఘంపై రాహుల్ తీవ్ర విమర్శలు
- తృణమూల్ పేరు, గుర్తు ఫ్రీజ్‌పై ఆగ్రహం
- బీజేపీ-ఈసీ చేతులు కలిపాయని ఆరోపణ
- ప్రజల తీర్పును కాపాడాలని డిమాండ్
- స్వేచ్ఛాయుత ఎన్నికల కోసం పోరాడతామని వెల్లడి

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 18 :**

పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ పేరు, 'పువ్వులుగడ్డి' ఎన్నికల గుర్తును ఎన్నికల సంఘం తాత్కాలికంగా ఫ్రీజ్ చేయడంపై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్రంగా స్పం దించారు. "మొదట ఓటు చోరీ.. తర్వాత ప్రభుత్వాల చో రీ.. ఇప్పుడు పార్టీ చోరీ" అంటూ శుక్రవారం సామాజిక మాధ్యమం 'ఎక్స' వేదికగా విమర్శించారు. దేశంలో ప్రజాస్వామ్యం దిగజారుతోందనడానికి తాజా పరిణామమే నిదర్శనమని ఆయన ఆరోపించారు. తృణమూల్‌లో మమతా బెనర్జీ, రితబ్రత బెనర్జీ నేతృత్వంలోని రెండు వర్గాలు పార్టీపై హక్కు తమదేనని వాదిస్తున్న నేపథ్యంలో ఎన్నికల సంఘం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. వివాదంపై తుది నిర్ణయం వెలువడే వరకు రెండు వర్గాలూ 'ఆల్ ఇండియా తృణమూల్ కాంగ్రెస' పేరు, రిజర్వ్ చేసిన 'పువ్వులుగడ్డి' గుర్తును ఉపయోగించకుండా ఆదేశించింది. అక్టోబర్ 6న జరగనున్న నందిగ్రామ్, రెజి నగర్ ఉప ఎన్నికల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది.

**'ప్రజల తీర్పును కాపాడాలి'**

ప్రజలు ఇచ్చిన తీర్పును పరిరక్షించాల్సిన రాజ్యాంగబద్ధ బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందని రాహుల్ పేర్కొన్నారు. కానీ ప్రజల తీర్పును మార్చే శక్తులకు ఈసీ సహకరిస్తోందని ఆరోపించారు. ముందుగా బీజేపీ, ఎన్నికల సంఘం కలిసి పనిచేస్తాయని, ఆ తర్వాత రాజకీయ పార్టీల గుర్తులపై ప్రభావం చూపుతాయని విమర్శించారు. గతంలో శివసేన, ఎన్సీపీ విషయంలోనూ ఇలాంటి పరిణామాలు చోటుచేసుకున్నాయని ఆయన ప్రస్తావించారు. ఇవన్నీ రాహుల్ గాంధీ చేసిన రాజకీయ ఆరోపణలే. ఈ పోరాటం మమతా బెనర్జీ ఒక్కరిదే కాదని, స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికలు కోరుకునే ప్రతి రాజకీయ పార్టీ, ప్రతి ఓటరుకు సంబంధించినదని రాహుల్ పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, ఎన్నికల సంఘం గడువు మేరకు రెండు తృణమూల్ వర్గాలు ప్రత్యామ్నాయ పేర్లు, గుర్తులను సమర్పించాయి. అనంతరం మమతా బెనర్జీ వర్గానికి 'మమతా ఆల్ ఇండియా తృణమూల్ కాంగ్రెస' పేరు, 'ఫుట్ బాల్ ప్లేయర' గుర్తును, ప్రత్యర్థి వర్గానికి 'డెమోక్రటిక్ తృణమూల్ కాంగ్రెస' పేరు, 'ఎన్వలప' గుర్తును ఎన్నికల సంఘం కేటాయించినట్లు తాజా సమాచారం.

# దేశ రాజధాని ఢిల్లీలో దారుణం

- 16 ఏళ్ల బాలికపై సామూహిక అత్యాచారం, హత్య..
- రెండు రోజుల తర్వాత మృతదేహం గుర్తింపు
- నలుగురు నిందితుల్లో ముగ్గురు మైనర్లు

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 18 :**

దేశ రాజధాని ఢిల్లీలో 16 ఏళ్ల బాలికపై సామూహిక అత్యాచారం జరిపి హత్య చేసినట్లు ఆరోపణలు రావడం కలకలం రేపింది. స్వరూప్‌నగర్ ప్రాంతంలో జరిగిన ఈ ఘటనలో 19 ఏళ్ల యువకుడితోపాటు ముగ్గురు మైనర్లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుల్లో బాలికకు పరిచయమున్న 17 ఏళ్ల బాలుడు కూడా ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. పోలీసుల వివరాల ప్రకారం.. గత శుక్రవారం రాత్రి బాలిక తనకు పరిచయమున్న 17 ఏళ్ల బాలుడిని కలిసేందుకు వెళ్లింది. అనంతరం అతడు మరో ముగ్గురితో కలిసి బాలికను తీసుకెళ్లినట్లు దర్యాప్తులో తేలిందని పోలీసులు పేర్కొన్నారు. ఆమెపై నలుగురూ సామూహిక అత్యాచారానికి పాల్పడి, హత్య చేసి మృతదేహాన్ని కుషాక్ రోడ్డుకు సమీపంలోని నిర్మానుష్య ప్రాంతంలో పడేసినట్లు ఆరోపిస్తున్నారు. రెండు రోజుల తర్వాత ఆదివారం స్థానికులు బాలిక మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహం తీవ్రంగా దెబ్బతిని ఉండటంతో తొలుత గుర్తింపు కష్టమైనట్లు పోలీసులు తెలిపారు. కనీసం లింగ నిర్ధారణ చేయలేని పరిస్థితుల్లో ఉన్నట్టు పోలీసులు తెలిపారు. ఆమె మృతదేహాన్ని కుక్కలు పీక్కుతిన్నాయని, ఒక చేయి వేరుగా పడి ఉన్నట్లు గుర్తించామన్నారు. మరోవైపు.. బాలిక అదృశ్య ఘటనపై ఆమె కుటుంబ సభ్యులెవరూ ఫిర్యాదు చేయలేదని చెప్పారు. ఆమె తరచూ ఇంటి నుంచి బయటకు వెళ్లేదని, కొద్ది రోజుల తర్వాత తిరిగి వస్తుండేదని వారు చెప్పారన్నారు. పోస్టుమార్టం నివేదిక, ఇతర ఆధారాల ఆధారంగా సామూహిక అత్యాచారం, హత్య కోణంలో దర్యాప్తు చేపట్టారు. సమీప ప్రాంతాల్లోని సీసీటీవీ దృశ్యాలను పరిశీలించిన పోలీసులు నలుగురు నిందితులను గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారిలో ఒకరికి 19 ఏళ్లు కాగా, మిగిలిన ముగ్గురు మైనర్లని పేర్కొన్నారు. బాలిక కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అపహరణ, అత్యాచారం, హత్యతోపాటు పోక్సో చట్టంలోని సంబంధిత నిబంధనల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# స్పామ్ కాల్స్‌కు ట్రాయ్ కొత్త చెక్!

- అనవసర కాల్స్, సందేశాలపై మరింత కఠిన నిబంధనలు
- మూడు ఫిర్యాదులతోనే అనుమానిత నంబర్‌పై చర్య
- వినియోగదారులకు కొత్త అప్పీల్ అవకాశం

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 18 :**

మొబైల్ వినియోగదారులను వేధిస్తున్న స్పామ్ కాల్స్, అనవసర వాణిజ్య సందేశాలకు అడ్డుకట్ట వేసేందుకు భారత టెలికాం నియంత్రణ సంస్థ ట్రాయ్ నిబంధనలను మరింత కఠినతరం చేసింది. సాంకేతిక ఆధారిత పర్యవేక్షణ, టెలికాం సంస్థల మధ్య సమాచార మార్పిడి, వినియోగదారులకు అదనపు రక్షణ కల్పించేలా వాణిజ్య సమాచార నియంత్రణ నిబంధనల్లో మూడో సవరణను సెప్టెంబర్ 18న విడుదల చేసింది. కొత్త నిబంధనల ప్రకారం స్పామ్‌కు ఎక్కువగా ఉపయోగించే అవకాశం ఉన్న నంబర్లను టెలికాం సంస్థలు ముందుగానే గుర్తించాలి. ఆ సమాచారాన్ని ఇతర ఆపరేటర్లతో పంచుకోవడంతోపాటు అనుమానిత నంబర్ల గుర్తింపు వివరాలను మళ్లీ తనిఖీ చేయాలి. స్పామ్‌కు పాల్పడుతున్నట్లు నిర్ధారణైతే నంబర్‌ను నిలిపివేసే వరకు చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. వాణిజ్య, అధికారిక సమాచారానికి కేటాయించిన ప్రత్యేక నంబర్ సిరీస్‌లకు కూడా స్పష్టమైన రక్షణ కల్పించారు. ముఖ్యంగా నియంత్రిత సంస్థల సేవలు, లావాదేవీల కాల్స్‌కు ఉపయోగించే 1600 సిరీస్ నంబర్లను స్పామ్‌గా ట్యాగ్ చేయడం, బ్లాక్ చేయడం లేదా ఫిల్టర్ చేయడం అనుమతించబడదని ట్రాయ్ ఇప్పటికే స్పష్టం చేసింది. 140 సిరీస్ ప్రధానంగా ప్రచార కాల్స్‌కు వినియోగిస్తారు. స్పామ్‌ను గుర్తించే కాల్ మేనేజ్‌మెంట్, థర్డ్ పార్టీ యాప్‌ల విషయంలోనూ కొత్త నిబంధనలు తీసుకొచ్చారు. టెలికాం సంస్థల నుంచి స్పామ్‌కు సంబంధించిన సమాచారాన్ని పొందాలంటే ఆయా యాప్‌లు తమ వద్ద ఉన్న సంబంధిత సమాచారాన్ని తిరిగి ఆపరేటర్లతో పంచుకోవాల్సి ఉంటుంది. దీంతో స్పామ్ నంబర్లను వేగంగా గుర్తించి చర్యలు తీసుకునే వ్యవస్థ బలోపేతం కానుంది. అలాగే ఒక నంబర్‌పై చర్యకు అవసరమైన ఫిర్యాదుల పరిమితిని ఐదు నుంచి మూడుకు తగ్గించారు.

# నందిగ్రామ్ ఉపఎన్నికలో మమతకు షాక్

- మమతా వర్గం అభ్యర్థి సంచిత ప్రధాన్ దేవ్ అనూహ్యంగా వైదొలగింపు
- నామినేషన్ల ఉపసంహరణకు ఒక్కరోజు ముందు కీలక నిర్ణయం
- కాంగ్రెస్‌కు పూర్తి మద్దతు ప్రకటించిన మమతా బెనర్జీ
- నబన్నలో సీఎం సువేందు అధికారితో భేటీ అనంతరం నామినేషన్ ఉపసంహరణ
- టీఎంసీ వర్గాలకు వేర్వేరు పేర్లు, గుర్తులు కేటాయించిన ఎన్నికల సంఘం
- బీజేపీ ప్రతిపక్షాలను బలహీనపరుస్తోందని మమతా బెనర్జీ ఆరోపణ

**కోల్‌కతా, సెప్టెంబర్ 18:**

బంగాల్ రాజకీయాల్లో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. అక్టోబర్ 6న జరగనున్న నందిగ్రామ్ అసెంబ్లీ ఉపఎన్నికలో మమతా బెనర్జీ వర్గం తరఫున పోటీ చేస్తున్న సంచిత ప్రధాన్ దేవ్ అనూహ్యంగా బరిలో నుంచి తప్పుకున్నారు. నామినేషన్ల ఉపసంహరణ గడువుకు ఒక్కరోజు ముందు ఆమె తన నామినేషన్‌ను వెనక్కి తీసుకున్నారు. దీంతో నియోజకవర్గంలో మమతా వర్గానికి అభ్యర్థి లేకుండా పోయింది.

**కాంగ్రెస్‌కు మద్దతు**

సంచిత ప్రధాన్ దేవ్ నామినేషన్ ఉపసంహరించుకున్న కొన్ని గంటల్లోనే మమతా బెనర్జీ కీలక ప్రకటన చేశారు. నందిగ్రామ్ ఉపఎన్నికలో కాంగ్రెస్‌కు తమ వర్గం పూర్తి మద్దతు ఇస్తుందని వెల్లడించారు. ప్రతిపక్షాల ఐక్యతకు రాహుల్ గాంధీ, ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ సంఘీభావం ప్రకటించారని తెలిపారు. బీజేపీకి వ్యతిరేకంగా అందరం కలిసికట్టుగా పోరాడతామని స్పష్టం చేశారు.

**నబన్నలో భేటీ తర్వాతే..**

నామినేషన్ ఉపసంహరించుకున్న సంచిత ప్రధాన్ దేవ్ తన భర్త సత్యజిత్‌తో కలిసి బంగాల్ సచివాలయం నబన్నకు వెళ్లారు. అక్కడ సీఎం సువేందు అధికారితో సమావేశమయ్యారు. భేటీ ముగిసిన వెంటనే ఆమె నామినేషన్ ఉపసంహరించుకోవడం రాజకీయంగా చర్చకు దారితీసింది. ఈ పరిణామంపై మమతా వర్గం నుంచి వివరణ వెలువడాల్సి ఉంది.



**టీఎంసీ వర్గాలకు వేర్వేరు గుర్తులు**

టీఎంసీ పేరు, ఎన్నికల గుర్తుపై ప్రత్యర్థి వర్గాల మధ్య వివాదం కొనసాగుతున్న నేపథ్యంలో ఎన్నికల సంఘం శుక్రవారం కీలక నిర్ణయం తీసుకుంది. మమతా నేతృత్వంలోని వర్గానికి 'మమతా ఆల్ ఇండియా తృణమూల్ కాంగ్రెస్' పేరుతో 'ఫుట్ బాల్ ప్లేయర్' గుర్తును కేటాయించింది. అరూప్ రాయ్ నేతృత్వంలోని వర్గానికి 'డెమోక్రటిక్ తృణమూల్ కాంగ్రెస్' పేరుతో 'ఎన్వలప్' గుర్తును ఇచ్చింది.

**ప్రజాస్వామ్యానికి చీకటి రోజంటూ మమత వ్యాఖ్య**

తమ పార్టీ సాంప్రదాయ ఎన్నికల గుర్తును తొలగించడాన్ని మమతా బెనర్జీ తీవ్రంగా వ్యతిరేకించారు. 28 ఏళ్లుగా తమ పార్టీ వద్ద ఉన్న గుర్తును ఎన్నికల సంఘం ఎలా స్తంభింపజేస్తుందని ప్రశ్నించారు. ఈ పరిణామాన్ని ప్రజాస్వామ్యానికి చీకటి రోజుగా అభివర్ణించారు. దేశవ్యాప్తంగా ప్రతిపక్షాలను విచ్ఛిన్నం చేసి బలహీనపరచడమే బీజేపీ లక్ష్యమని ఆరోపించారు. టీఎంసీలోని తిరుగుబాటు నేతలు బీజేపీకి పనిచేస్తున్నారని విమర్శించారు. నిన్నటి వరకు తమ పార్టీ గుర్తుపై గెలిచిన వారే ఇప్పుడు అదే గుర్తును సవాల్ చేయడం దారుణమని మమత వ్యాఖ్యానించారు.

# పాక్ ఆరోపణలను తిప్పికొట్టిన భారత్

- అరేబియా సముద్రంలో నౌకల ఢీకొన్న ఘటనపై ఇస్లామాబాద్ వాదనలకు భారత్ ఖండన
- పీఎన్ఎస్ హునైన్ ప్రమాదకర ఓవర్‌టేకింగ్ వల్లే ఘటన జరిగిందన్న జైస్వాల్
- 1991 భారత్–పాక్ ఒప్పందంలోని ఆర్టికల్ 10 ఉల్లంఘన
- అంతర్జాతీయ సముద్ర నిబంధనలకూ పాక్ నౌక విరుద్ధంగా వ్యవహరించిందని వెల్లడి
- ఐఎన్ఎస్ కోల్‌కతాకు పెద్దగా నష్టం లేదని స్పష్టీకరణ

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 18:**

అరేబియా సముద్రంలో భారత యుద్ధనౌక, పాకిస్థాన్ నౌక ఢీకొన్న ఘటనపై ఇస్లామాబాద్ చేసిన ఆరోపణలను భారత్ తిరస్కరించింది. పాకిస్థాన్ ఇచ్చిన వివరణను 'ఎప్పటిలాగే వాస్తవాలను పక్కదారి పట్టించే ప్రయత్నం'గా విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ అభివర్ణించారు. పాకిస్థాన్ నౌక ప్రమాదకరంగా ఓవర్‌టేక్ చేయడంతోనే ఈ ఘటన చోటుచేసుకుందని ఆయన స్పష్టం చేశారు.

**ఒప్పంద నిబంధనల ఉల్లంఘన**

ఉత్తర అరేబియా సముద్రంలో సాధారణ గస్తీ విధుల్లో ఉన్న ఐఎన్ఎస్ కోల్‌కతా వద్దకు పాకిస్థాన్ నౌక పీఎన్ఎస్ హునైన్ అధిక వేగంతో చేరి ప్రమాదకరంగా మలుపు తీసుకోవడంతో ఢీకొన్నట్లు భారత ప్రభుత్వం తెలిపింది. ఈ చర్య 1991 ఏప్రిల్‌లో కుదిరిన భారత్-పాక్ సైనిక విన్యాసాలు, కదలికలకు సంబంధించిన ఒప్పందంలోని ఆర్టికల్ 10కు విరుద్ధమని జైస్వాల్ పేర్కొన్నారు. ఈ నిబంధన ప్రకారం అంతర్జాతీయ జలాల్లో ఇరుదేశాల నౌకాదళ విభాగాలు ఒకదానికొకటి మూడు నాటికల్ మైళ్ల కంటే దగ్గరగా ఉండకూడదు. అంతే కాకుండా సముద్రంలో నౌకల ఢీకొనడాన్ని నివారించేందుకు అమల్లో ఉన్న అంతర్జాతీయ నిబంధనలను కూడా పాకిస్థాన్ నౌక ఉల్లంఘించిందని భారత్ తెలిపింది.



**భారత్ తీవ్ర నిరసన**

ఈ ఘటనపై భారత్ ఇప్పటికే న్యూఢిల్లీలోని పాకిస్థాన్ చార్జ్ డి అఫైర్స్‌ను పిలిపించి తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఇరుదేశాల మధ్య అమల్లో ఉన్న సంబంధిత ఒప్పందాలను, సముద్ర భద్రతా నిబంధనలను పాటించాలని పాకిస్థాన్‌కు సూచించింది. పాకిస్థాన్ మాత్రం ఈ ఘటన తమ ప్రత్యేక ఆర్థిక మండలిలో జరిగిందని, భారత నౌకే 'రెచ్చగొట్టే చర్య'కు పాల్పడిందని ఆరోపించింది. ఇరుదేశాలు ఘటనపై భిన్న వాదనలు వినిపిస్తున్నాయి.

**కోల్‌కతాకు పెద్దగా నష్టం లేదు**

సెప్టెంబర్ 15న రాత్రి ఉత్తర అరేబియా సముద్రంలో ఈ ఘటన జరిగింది. భారత నౌకకు పెద్దగా నష్టం వాటిల్లలేదని, అది సముద్రంలోనే తన విధులను కొనసాగిస్తోందని జైస్వాల్ తెలిపారు. పీఎన్ఎస్ హునైన్ మాత్రం దెబ్బతినడంతో మరమ్మతుల కోసం నౌకాశ్రయానికి తిరిగి వెళ్లినట్లు సమాచారం.

# రైతాంగానికి వెన్నుదన్నుగా ప్రభుత్వం

- ఎల్నినోపై రైతులకు ముందుగానే అవగాహన కల్పించాం
- పంటల ఎంపికపై ముందస్తు సూచనలు
- కృష్ణా జలాల్లో న్యాయమైన వాటా సాధిస్తాం
- తాగునీటికే తొలి ప్రాధాన్యత
- శాసనసభలో మంత్రి కెప్టెన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి

**హైదరాబాద్, సెప్టెంబర్ 18:**

రైతాంగానికి రాష్ట్ర ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలుస్తోందని నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఎల్ నినోపై శాసనసభలో శుక్రవారం జరిగిన స్వల్పకాలిక చర్చలో పాల్గొంటూ ఇది రైతు ప్రభుత్వం.. అన్నదాతలను ఒంటరిగా వదలబోమన్నారు. ఎల్ నినో తీవ్రతపై ముందుగానే రైతులకు అవగాహన కల్పించామన్నారు. వర్షపాతం తగ్గే అవకాశం, సాగునీటి కొరతపై అన్నదాతలను అప్రమత్తం చేశామని తెలిపారు. రైతులు నష్టపోకుండా పంటల ఎంపికపై ముందస్తు సూచనలు ఇచ్చాం. ఆయకట్టు వారీగా నీటి లభ్యతపై ఖచ్చితమైన సమాచారం అందిస్తున్నాం. ప్రతి మంగళవారం రైతు నేస్తం ద్వారా జలాశయాల పరిస్థితిని వివరిస్తున్నాం. నీరు సరిపోని చోట పంటలు వేయమని చెప్పడం బాధ్యతా రాహిత్యమవతుందన్నారు. ప్రజల తాగునీటికే ప్రభుత్వం తొలి ప్రాధాన్యత ఇస్తుంది. తాగునీటి అవసరాలు తీర్చిన తరువాతే మిగులు జలాలను సాగుకు విడుదల చేస్తామని స్పష్టం చేశారు. వచ్చే వేసవినిదృష్టిలో పెట్టుకుని ఇప్పటి నుంచే నీటి నిల్వలను పరిరక్షిస్తున్నామని గుర్తుచేశారు. ప్రతి ప్రాజెక్టుకు ప్రత్యేక నీటి బడ్జెట్ అమలు చేస్తున్నాం. జలాశయాల నిల్వలు, కొత్త ప్రవాహాలను పది రోజులకోసారి సమీక్షిస్తాం. శ్రీశైలంలో వినియోగయోగ్యమైన నీరు గత ఏడాది 153.56 టీఎంసీలు.. ప్రస్తుతం 61.65 టీఎంసీలే వున్నాయన్నారు. నాగార్జునసాగర్‌లో గత సంవత్సరం 174.25 టీఎంసీలుండగా ఈసారి 44.89 టీఎంసీలే వున్నాయన్నారు. జలాశయాల్లో కనిపించే మొత్తం నీరు సాగుకు అందుబాటులో ఉన్నట్లు కాదు. రాష్ట్రంలోని 44,034 చెరువుల్లో 40 శాతం పావు సామర్థ్యం కన్నా తక్కువగా నిండాయి. వాస్తవాలను దాచకుండా నీటి పరిస్థితిని ప్రజల ముందు ఉంచుతున్నాం. కృష్ణా జలాల్లో తెలంగాణకు న్యాయమైన వాటాను సాధించి తీరుతామని స్పష్టం చేశారు. తెలంగాణకు రావాల్సిన ఒక్క చుక్క నీటినీ వదులుకోబోమన్నారు. కృష్ణా జలాల కోసం ట్రిబ్యునల్, కేఆర్ఎంబీ, కేంద్రం వద్ద బలంగా వాదనలు వినిపిస్తున్నామన్నారు. కృష్ణా జలాల్లో 66:34 తాత్కాలిక నిష్పత్తిని శాశ్వత హక్కుగా అంగీకరించలేదని గుర్తుచేశారు. కృష్ణా జలాల్లో 50:50 పంపిణీ కోసం తెలంగాణ పట్టుబట్టింది. మేడిగడ్డ ఏడో బ్లాక్ దెబ్బతినడంతో నీటి మళ్లింపునకు పనికిరాని పరిస్థితి ఏర్పడింది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు ప్రస్తుతం నీటి నిల్వకు సురక్షితం కావని ఎన్‌డీఎస్‌ఏ స్పష్టం చేసిందన్నారు. ప్రజల ప్రాణభద్రతను పణంగా పెట్టి కాళేశ్వరం బ్యారేజీలను వినియోగించలేమన్నారు. చిన్న మరమ్మతుతోనే కాళేశ్వరాన్ని నడపవచ్చన్న బీఆర్ఎస్ వాదన సాంకేతికంగా తప్పన్నారు. ఎన్‌డీఎస్ఏ, సీడబ్ల్యూసీ మార్గదర్శకాల ప్రకారమే బ్యారేజీల పునరుద్ధరణ చేపడతామన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో సురక్షితంగా ఉన్న లింక్-2 ద్వారా పంపింగ్ కొనసాగిస్తున్నామన్నారు. పాలమూరురంగారెడ్డి పథకం 90 శాతం పూర్తయిందన్న బీఆర్ఎస్ ప్రచారం అవాస్తవం. కేవలం పంప్‌హౌస్‌లు నిర్మిస్తే ఎత్తిపోతల పథకం పూర్తయినట్లు కాదన్నారు. పాలమూరురంగారెడ్డిలో కాలువలు, పంపిణీ వ్యవస్థ, భూసేకరణ, పునరావాస పనులు అసంపూర్తిగా ఉన్నాయని



గుర్తుచేశారు. చట్టబద్ధ అనుమతులు, మిగిలిన నిర్మాణాలు పూర్తిచేసి పాలమూరు-రంగారెడ్డిని వినియోగంలోకి తెస్తామని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిన సాగునీటి ప్రాజెక్టులన్నింటినీ ప్రాధాన్య క్రమంలో పూర్తిచేస్తామన్నారు. కాలువల మరమ్మతులు, పంపింగ్ వ్యవస్థల పునరుద్ధరణను వేగవంతం చేస్తున్నామన్నారు. అందుబాటులో ఉన్న ప్రతి నీటి చుక్కను సమర్థంగా వినియోగిస్తామన్నారు. నిలిచిన పంటల రక్షణతోపాటు యాసంగి అవసరాలకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామన్నారు. ఎల్ నినోను ఆపలేకపోయినా దాని ప్రభావాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. రైతుల పంటలు, ప్రజల తాగునీరు, రాష్ట్ర జలహక్కుల పరిరక్షణే ప్రభుత్వ లక్ష్యమని మరోమారు స్పష్టం చేశారు.

**నీటి అవసరాలకు ప్రాధాన్యత : సీతక్క**

మంత్రి సీతక్క మాట్లాడుతూ వచ్చే వర్షాకాలం వరకు తాగు నీటి అవసరాలకు ఇబ్బందులు రాకుండా చూస్తున్నామన్నారు. రిజర్వాయర్ల నీటి వినియోగానికి సంబంధించి తాగు నీటికే ప్రథమ ప్రాధాన్యత నిస్తున్నాం. ప్రతిరోజూ అన్ని జలాశయాల్లోని నీటి మట్టాలను పర్యవేక్షిస్తున్నాం. ఇరిగేషన్ శాఖ వారితో వారాని కోకసారి సమన్వయ సమావేశాలు నిర్వహిస్తున్నాం.నీటి నిల్వ తగినంత అందుబాటులో లేని, ఇన్ ఫ్లోలు ఆశించనంతగా లేని రిజర్వాయర్లలో, డెడ్ స్టోరేజీ నీటిని వినియోగించుకునేందుకు వీలుగా మోటర్లను ఏర్పాటు చేయాలని ఆదేశాలు ఇచ్చామన్నారు. రాష్ట్రంలో తాగు నీటి కోసం ప్రస్తుతం ఉపయోగిస్తున్న జలాశయాల్లో సింగూరు ఒకటే కొంత ఇబ్బందికరంగా ఉందన్నారు. ప్రస్తుతం సింగూరు ప్రాజెక్టులో నీటి నిల్వ సుమారు 75 రోజులకు సరిపోతుంది. ఆ తర్వాత వర్షాలు కురవక పోతే ఏం చేయాలి అనే ఆలోచిస్తున్నాం. సింగూరు రిజర్వాయర్‌పై 4 జిల్లాల్లోని 2,395 గ్రామీణ ఆవాసాలు , 19 పట్టణ స్థానిక సంస్థలు ఆధారపడి ఉన్నాయి. ప్రత్యామ్నాయ తాగు నీటి సరఫరా కోసం ఆవాసాల వారీగా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేశాం. స్థానిక నీటి వనరులైన చేతి పంపులు, సింగిల్ ఫేజ్/త్రీ ఫేజ్ పథకాలు, బావులు సిద్ధంగా ఉంచాం. స్థానిక నీటి వనరులు అందుబాటులో లేని ప్రాంతాల్లో బోర్ వెల్స్‌ను అద్దెకు తీసుకోవడం లేదా సమీపంలోని నీటి వనరుల నుంచి నీటిని తరలించడం వంటి ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టేందుకు ప్రణాళిక రూపొందించామన్నారు. కృష్ణా బేసిన్‌లో 14, బేసిన్‌లో 20 రిజర్వాయర్ల నీటిని వినియోగించుకుంటున్నామన్నారు. ఏదైనా సమస్య తలెత్తితే ప్రత్యామ్నాయ ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. వీబీజీరాంజీ.. పేరు ఏదైనా కరవు, కష్టకాలంలో ప్రజలకు ఉపాధి కల్పించడమే ఉపాధి హామీ పథకం లక్ష్యం. అందులో భాగంగా ప్రతి గ్రామ పంచాయతీల్లో కనీసం 60 కుటుంబాలకు పని కల్పించే లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు. గ్రామాల్లో పెద్ద ఎత్తున పనులు ప్రారంభించాం.ఎండలు తీవ్రంగా ఉన్న ఏప్రిల్ నుంచి జూన్ వరకు రోజుకు సగటున 12 లక్షల మంది కూలీలు ఉపాధి పనులకు హాజరయ్యారు. జూలై నుంచి రోజుకు సగటున 2 లక్షల మంది కూలీలు ఉపాధి పనులకు హాజరవుతున్నారు. ఆగస్టు, సెప్టెంబర్ ల్లో గతంలో ఎన్నడు లేని విధంగా రికార్డు స్థాయిలో పనులు కల్పిస్తున్నాం. ఇప్పటివరకు 2 వేల కోట్లకు పైగా వేతనాలు నేరుగా కూలీలకు చెల్లించాం. వీబీ జీ రాం జీ వల్ల రాష్ట్రం మీద 40శాతం భారం పడుతోందన్నారు. ఇంటింటికీ ఇంకుడు గుంత.. ప్రతి పొలానికి పంట కుంట.. ప్రతి ఊరికి ఊట కుంట.. అనే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నాం అని మంత్రి సీతక్క చెప్పారు.

# 9వ డివిజన్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా దేశగోని శ్రీనివాస్ గౌడ్

- పార్టీ బలోపేతానికి కృషి చేయాలి: తోటకూర వజ్రేష్ యాదవ్
- నియామక ఉత్తర్వులు జారీ చేసిన జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు





**మేడిపల్లి, రాజముద్ర న్యూస్ :** మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మేడిపల్లి 9వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా దేశగోని శ్రీనివాస్ గౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు, మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గజ్జల కాంతరావు, డివిజన్ అధ్యక్షులు తుంగతుర్తి రవి నియామక పత్రాన్ని అందించారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకత్వం ఆదేశాల మేరకు మేడిపల్లి 9వ డివిజన్‌లో పార్టీ కార్యకలాపాలను మరింత విస్తరించేందుకు శ్రీనివాస్ గౌడ్‌కు బాధ్యతలు అప్పగించారు. డివిజన్‌లో పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడంతో పాటు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పార్టీ నాయకత్వం సూచించింది. కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ పార్టీ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించడంలో ప్రధాన కార్యదర్శి కీలక పాత్ర పోషించాల్సి ఉంటుందని నాయకులు పేర్కొన్నారు. ప్రధాన కార్యదర్శిగా నియామకం పొందిన దేశగోని శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి పార్టీ బాధ్యతలు అప్పగించిన జిల్లా అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. తన నియామకానికి సహకరించిన దర్గా దయాకర్ రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు తుంగతుర్తి రవి దుబ్బాక జైహింద్ గౌడ్‌లకు ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా పనిచేస్తానని, పార్టీ నాయకత్వం అప్పగించిన బాధ్యతలను సమర్థంగా నిర్వర్తిస్తూ ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడతానని వెల్లడించారు. పార్టీ శ్రేణులు, నాయకులు దేశగోని శ్రీనివాస్ గౌడ్‌కు అభినందనలు తెలిపారు.

# వార్త విశ్లేషణ: అగ్నిపరీక్షలో జర్నలిజం నేపథ్యం, కారణాలు, పరిష్కారాలు

**ఖమ్మం రాజముద్ర న్యూస్:** భారత ప్రజాస్వామ్యంలో జర్నలిజాన్ని నాల్గవ స్తంభంగా అభివర్ణిస్తారు. శాసన, కార్యనిర్వాహక, న్యాయ వ్యవస్థల తర్వాత ప్రజలకు నిజాలు చేరవేసే బాధ్యత పత్రికలదే. కానీ గత దశాబ్దకాలంలో, ముఖ్యంగా జిల్లా, మండల స్థాయిలో పనిచేసే గ్రామీణ విలేకరుల పరిస్థితి దయనీయంగా మారింది. పై కథనంలో విలేకరి వ్యక్తం చేసిన "కలమే ఉరితాడుగా మారుతోందా" అనే ఆవేదన అతిశయోక్తి కాదు, క్షేత్రస్థాయి వాస్తవం.

**రాజకీయ, అధికార ఒత్తిడి**

అవినీతిపై వార్త రాస్తే "నీ ఉద్యోగం ఊడిస్తాం, కేసులు పెడతాం" అనే బెదిరింపులు సర్వసాధారణమయ్యాయి. సమాచార హక్కు చట్టం ఉన్నా, అధికారులు సమాచారం ఇవ్వడానికి నిరాకరిస్తున్నారు. ప్రశ్నించే జర్నలిస్టును అభివృద్ధి నిరోధకుడిగా ముద్ర వేస్తున్నారు.

**ఆర్థిక దోపిడీ**

పెద్ద మీడియా సంస్థలు సైతం జిల్లా విలేకరులను స్ట్రింగర్లుగానే చూస్తున్నాయి. నెలకు రూ. 5,000 – 10,000 కూడా అందని పరిస్థితి. దీంతో చాలామంది ప్రకటనలపై, నాయకుల దయాదాక్షిణ్యాలపై ఆధారపడాల్సి వస్తోంది. ఇది స్వతంత్ర జర్నలిజానికి గొడ్డలిపెట్టు.




**ప్రజల నుంచి వ్యతిరేకత**

ఇది అత్యంత విషాదకర అంశం. ప్రజా ప్రయోజనం కోసం ఫుట్‌పాత్ ఆక్రమణలు, అక్రమ కట్టడాలు, ట్రాఫిక్ సమస్యలపై రాస్తే బాధితులుగానే భావించాల్సిన వారి నుంచే శాపనార్థాలు వస్తున్నాయి. "మా పొట్ట కొడుతున్నావా" అనే ప్రశ్న వెనుక తక్షణ ఉపాధి భయం ఉంది, కానీ దీర్ఘకాలంలో అదే అక్రమం వారి పిల్లల భవిష్యత్తును దెబ్బతీస్తుందని గ్రహించలేకపోతున్నారు.

**సోషల్ మీడియా ప్రభావం**

వాట్సాప్, యూట్యూబ్‌లలో ఎవరైనా జర్నలిస్ట్ అయిపోతున్నారు. వృత్తిపరమైన విలువలు లేని వారు డబ్బుల కోసం వార్తలను వక్రీకరిస్తున్నారు. దీంతో నిజమైన విలేకరులపై కూడా ప్రజలకు నమ్మకం సన్నగిల్లుతోంది. చట్టపరమైన రక్షణ: జర్నలిస్టుల రక్షణకు ప్రత్యేక చట్టం తీసుకురావాలి. విధి నిర్వహణలో దాడి చేస్తే నాన్–బెయిలబుల్ కేసు నమోదు చేయాలి. ఆర్థిక భద్రత: వేజ్ బోర్డు సిఫార్సులను కఠినంగా అమలు చేయాలి. గ్రామీణ విలేకరులకు అక్రిడిటేషన్, ఆరోగ్య బీమా, ప్రమాద బీమా తప్పనిసరి చేయాలి. ప్రజల్లో చైతన్యం: పాఠశాల స్థాయి నుంచే మీడియా అక్షరాస్యత పెంచాలి. జర్నలిస్టు శత్రువు కాదు, సమాజానికి కాపలాదారు అనే భావన కల్పించాలి. స్వీయ నియంత్రణ: జర్నలిస్టులు కూడా పసుపు జర్నలిజానికి దూరంగా ఉండి, విలువలతో కూడిన రిపోర్టింగ్ చేయాలి. అప్పుడే ప్రజాదరణ, విశ్వసనీయత పెరుగుతాయి. కత్తిమీద సాము చేస్తున్న విలేకరి కన్నీరు కేవలం వ్యక్తిగత బాధ కాదు, వ్యవస్థకు హెచ్చరిక. కలాన్ని కాపాడుకోలేని సమాజం నిజాన్ని కోల్పోతుంది. నిజాన్ని కోల్పోయిన సమాజంలో ప్రజాస్వామ్యం మనుగడ సాగించలేదు. కాబట్టి జర్నలిస్టును కాపాడుకోవడం అంటే ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడమే.

# బుల్లెట్ ట్రైన్ డిమాండ్‌పై సూర్యాపేట బంద్ సక్సెస్

- సూర్యాపేట పట్టణ బంద్ సంపూర్ణం
- సబ్బండ వర్గాల ర్యాలీలు...



**సూర్యాపేట, రాజముద్ర న్యూస్:** జాతీయ రహదారి 65 కు సమాంతరంగా బుల్లెట్ ట్రైన్ మరియు రైల్వే కారిడార్ నిర్మాణం చేపట్టారని బుల్లెట్ ట్రైన్ సాధన పోరాట కమిటీ ఇచ్చిన సూర్యాపేట పట్టణ బంద్ శుక్రవారం స్వచ్ఛందంగా, ప్రశాంతంగా జరిగింది.సూర్యాపేట బస్ డిపో ఎదురుగా తెల్లవారుజామున నాలుగు గంటలకు ప్రారంభమైన బంద్ 8 గంటలకు కొందరు నేతల అరెస్టుతో బంద్ పట్టణంలోకి చేరింది. వివిధ సంఘాలు భారీ ర్యాలీలతో బంద్ జయప్రదం చేసేందుకు మోటార్ సైకిల్ ర్యాలీలతో పట్టణం లో దద్దరిల్లింది అప్పటికే స్వచ్ఛందంగా బంద్ పాటిస్తున్న వర్తక, వాణిజ్య, వ్యాపార, ప్రభుత్వ,ప్రైవేటు విద్యాసంస్థలు, వర్క్ షాప్ లు, హోటళ్లు షాపింగ్ మాల్ లు, కిరాణా షాపులు, ఆటో నగర్, బైక్ మెకానిక్ ల అసోసియేషన్ ఇలా ఒక్కటేమిటి పట్టణంలోని అన్ని రంగాల సంస్థలు మూసివేసి సంఘీభావం ప్రకటించారు.రిటైర్డ్ ఉద్యోగుల సంఘం,సూర్యాపేట బార్ అసోసియేషన్, ఆటోనగర్ కార్మిక సంఘం,హోటల్ యజమానుల సంఘం, టైలర్స్ అసోసియేషన్,తదితర సంఘాలు,క్లాత్ మర్చంట్ అసోసియేషన్,దివ్యాంగుల అసోసియేషన్,తదితర సంఘాలు బందుకు మద్దతుగా ర్యాలీలు తీశారు.ఆర్యవైశ్య సంఘం ప్రముఖులు,ముస్లిం మైనారిటీ నేతలు,మహిళా సంఘాల బాధ్యులు, బందులో, ర్యాలీ లో పాల్గొన్నారు. అన్ని పార్టీల నేతలు, విద్యార్థి, యువజన సంఘాలు, స్వచ్ఛంద సంస్థల బాధ్యులు, బుల్లెట్ ట్రైన్ సాధన కమిటీ ప్రధాన బాధ్యులు పట్టణ బందులో పూర్తిగా పాల్గొని ముందుండి నడిచారు. మధ్యాహ్నం దీక్షా శిబిరం నుండి కొత్త బస్టాండ్ వరకు అన్ని సంఘాలు సంస్థలు పార్టీలతో భారీ ర్యాలీ నిర్వహించడం జరిగింది. దీనిలో స్థానిక శాసనసభ్యులు గుంటకండ్ల జగదీశ్వర్ రెడ్డి, మాజీ పార్లమెంటు సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్, మాజీ పర్యాటక శాఖ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి,మాజీ మున్సిపల్ చైర్మన్ పర్సన్ పెరుమాళ్ళ అన్నపూర్ణ, జుట్టు కొండ సత్యనారాయణ డాక్టర్ రామ్మూర్తి యాదవ్ ,కొనకంచి వీరభద్రయ్య, అనంతుల యల్లయ్య, యాదగిరి రావు, గండూరు శంకర్ యమా ప్రభాకర్, ఇరుగు కోటేశ్వరి జహంగీర్,పోలేబోయిన కిరణ్, గంట నాగయ్య, బిలిదే శ్రీను బండారు రాజా కర్నాటి కిషన్,రవి సలిగంటి వీరేందర్ ముప్తి సయ్యద్, రాపర్తి శ్రీనివాస్ గౌడ్,రాందేని అదినారాయణ,యాతకుల రాజయ్య,సంపత్ సింహాద్రి సుమన్ నాయక్ నాగు నాయక్ మురళి తదితరులు పాల్గొన్నారు.శంషాబాద్ నుండి చెన్నై కి వయా జాతీయ రహదారి 65 సూర్యాపేట కు మద్దతుగా సూర్యాపేట పట్టణ బందును, విజయవంతం చేసి ప్రజల ఆకాంక్షను బలంగా రాష్ట్ర స్థాయికి చేరిందని ఉద్యమ కమిటి అభిప్రాయం వ్యక్తం చేసింది.బంధు మొత్తాన్ని కవర్ చేస్తూ ఎప్పటికప్పుడు ప్రచారంలోకి తీసుకువచ్చి మద్దతుగా నిలిచిన ఎలక్ట్రానిక్ అండ్ ప్రింట్ మీడియా, సోషల్ మీడియా బాధ్యులకు బుల్లెట్ ట్రైన్ ఉద్యమ కమిటీ ధన్యవాదాలు తెలిపారు ఈ కార్యక్రమంలో ఉద్యమ కమిటీ కన్వీనర్ ప్రొఫెసర్ ఆరుట్ల జానకి రెడ్డి ,సలహా దారులు పెద్దిరెడ్డి గణేష్ ,రమణాచారి,పెద్దిరెడ్డి రాజా, ధర్మార్జున్,మల్లు నాగార్జున రెడ్డి , తండు శ్రీనివాస్ యాదవ్, డేవిడ్ కుమార్ , బూర వెంకటేశ్వర్లు ,కొత్తపల్లి శివకుమార్, రేణుక, నెమ్మది వెంకటేశ్వర్లు, వేల్పుల వెంకన్న, అనంతుల మధు,జర్నలిస్టు భూపతి రాములు, యాదగిరి,సట్టు నాగయ్య, వెలుగు వనిత, శోభారాణి విద్యార్థి సంఘం నాయకులు బషీపంగు సునీల్, ఎనిగా సంతోష్ రెడ్డి, పోరెళ్ల విప్లవ్ కుమార్,గుగులోత్ సురేష్ నాయక్,దారావత్ శివ నాయక్, సందీప్,మహేందర్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

**అక్రమ అరెస్టు లు**

బుల్లెట్ ట్రైన్ సాధనలో ముందస్తుగా బందుకు పిలుపునిచ్చి పట్టణ ఆర్టీసీ డిపో ముందు నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యమకారులను పోలీసులు అరెస్టు చేశారు. ప్రజల పక్షాల ఆధ్వర్యంలో తెల్లవారుజామున నాలుగు గంటల నుండి ఏడున్నర గంటల వరకు డిపో ముందు ఆంధ్ర వ్యక్తం చేశారు. ఎక్కడి బస్సులు అక్కడే నిలిచిపోయాయి. పట్టణ సిఐ పోలీసులు రంగ ప్రవేశం చేసి ఉద్యమకారులను అరెస్టు చేశారు.కన్వీనర్ ప్రొఫెసర్ జానకి రెడ్డి, చలమల నరసింహ, బూర వెంకటేశ్వర్లు,వెలుగు వనిత, సట్టు నాగయ్య, యార్క చర్ల శోభారాణి, రేణుక, పద్మ, ఇమామ్ బి,రామ్మూర్తి గౌడ్, యాదగిరి, మీనయ్య తో పాటు మొత్తం 14 మందిని అరెస్ట్ చేసి పట్టణ పోలీస్ స్టేషన్ కు తరలించారు. అరెస్టు లకు నిరసనగా అఖిల పక్షాల నిరసన వ్యక్తం చేశారు.

# సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ వచ్చే వరకు పోరాటం

- అఖిలపక్షాల ఆధ్వర్యంలో బంద్..
- బుల్లెట్ ట్రైన్ కోసం ఉద్యమాన్ని ఉద్ధృతం చేస్తాం
- కౌన్సిలర్, డాక్టర్ ఊర రామ్మూర్తి




**సూర్యాపేట: రాజముద్ర న్యూస్ :** సూర్యాపేట జిల్లా కేంద్రం మీదుగా బుల్లెట్ ట్రైన్ ఏర్పాటు చేయాలనే డిమాండ్‌తో చేపడుతున్న ప్రజా ఉద్యమాన్ని మరింత ఉద్ధృతం చేస్తామని కౌన్సిలర్, డాక్టర్ ఊర రామ్మూర్తి అన్నారు. సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ వచ్చే వరకు తమ పోరాటం ఆగబోదని ఆయన స్పష్టం చేశారు.శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో బుల్లెట్ ట్రైన్ సాధన కోసం అఖిలపక్షాల ఆధ్వర్యంలో బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ ఊర రామ్మూర్తి మాట్లాడుతూ.. సూర్యాపేట జిల్లా అభివృద్ధికి బుల్లెట్ ట్రైన్ వంటి అత్యాధునిక రవాణా సదుపాయం ఎంతో అవసరమని అన్నారు. సూర్యాపేట మీదుగా బుల్లెట్ ట్రైన్ ఏర్పాటు చేయడం ద్వారా జిల్లా కేంద్రానికి రవాణా సౌకర్యాలు మరింత మెరుగుపడటంతో పాటు, పారిశ్రామిక, వాణిజ్య, విద్యా, వైద్య రంగాల అభివృద్ధికి కూడా ఊతం లభిస్తుందని పేర్కొన్నారు.సూర్యాపేటను బుల్లెట్ ట్రైన్ మార్గంలో చేర్చాలనే డిమాండ్ ప్రజల ఆకాంక్షగా మారిందని తెలిపారు. ఈ విషయంలో ప్రభుత్వం, సంబంధిత అధికారులు సానుకూలంగా స్పందించి సూర్యాపేట మీదుగా బుల్లెట్ ట్రైన్ వెళ్లేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజల అభిప్రాయాన్ని, జిల్లా ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.బుల్లెట్ ట్రైన్ కోసం చేపడుతున్న ఉద్యమానికి అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాలు, వ్యాపారవేత్తలు, ఉద్యోగులు, మేధావులు, యువతతో పాటు అన్ని వర్గాల ప్రజలు మద్దతుగా నిలవాలని డాక్టర్ ఊర రామ్మూర్తి పిలుపునిచ్చారు. సూర్యాపేట హక్కుల కోసం పార్టీలకు అతీతంగా అందరూ ఐక్యంగా ఉద్యమించాలని కోరారు. ప్రజల ఆకాంక్షను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే వరకు వివిధ దశల్లో ఆందోళన కార్యక్రమాలు కొనసాగిస్తామని, అవసరమైతే ఉద్యమాన్ని మరింత విస్తృతం చేస్తామని ఆయన తెలిపారు. సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ సాధించే లక్ష్యంతో ప్రజా ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో శ్రీధర్ బాబు, పత్తిపాక వేణుధర్, వివిధ విద్యార్థి సంఘాల నాయకులు, అఖిలపక్షాల ప్రతినిధులు, ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## భద్రాద్రి దేవస్థానానికి 300 గజాల స్థలం విరాళం



**ఖమ్మం రాజముద్ర న్యూస్:** నేలకొండపల్లిలోని భక్త రామదాసు ధ్యాన మందిరం ఎదురుగా ఉన్న 300 గజాల ప్లాట్‌ను దాతలు భద్రాద్రి దేవస్థానానికి విరాళంగా అందజేశారు.దాతలు మర్ల ప్రమీలాదేవి, మర్ల అన్నపూర్ణ తమ సొంత ఖర్చులతో రిజిస్ట్రేషన్ చేయించి, భద్రాచలం దేవస్థానం సూపరింటెండెంట్ నిరంజన్‌కు అందజేశారు.ఈ కార్యక్రమంలో సాధు రాధాకృష్ణమూర్తి, పెండ్యాల గోపాలకృష్ణమూర్తి, మన్నె కోటేశ్వరరావు, ఉన్నం కొండలరావు, కంచర్ల దేవీప్రసాద్, పూజారి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎంపి రంజిత్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు...

ప్రభుత్వ బాలికల పాఠశాల విద్యార్థులుకు సామాగ్రి పంపిణీ...



**శంకర్ పల్లి, రాజముద్ర న్యూస్:** చేవెళ్ల పార్లమెంట్ మాజీ ఎంపీ గడ్డం రంజిత్ రెడ్డి జన్మదినం సందర్భంగా శంకర్ పల్లి మునిసిపల్ పరిధిలోని బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినిలకు ప్లేట్ లు, గ్లాసులు పంపిణి చేసిన శంకర్ పల్లి కాంగ్రెస్ నాయకులు. అనంతరం విద్యార్థినిలతో కేక్ కట్ చేయించారు. విద్యార్థినిలు ఉపాధ్యాయులు, మాజీ ఎంపీకి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేశారు. మునిసిపల్ చైర్మన్ సాత ప్రవీణ్ కుమార్, వైస్ చైర్ పర్సన్ జూలకంటి శ్వేత పాండు రంగారెడ్డి, డిసిసి ఉపాధ్యక్షులు చేకూర్తి గోపాల్ రెడ్డి, మున్సిపల్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ చంద్రమౌళి, మండల్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ బొల్లారం వెంకటరెడ్డి, కౌన్సిలర్లు గణేష్, అశోక్, దండు రాజేశ్వర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు సర్ తాజ్, శంకర్, భాస్కర్ రెడ్డి, మాజీ సర్పంచ్ నరేందర్ రెడ్డి, నాయకులు పార్శి బాలకృష్ణ, శ్రీనివాస్, శేరి అనంతరెడ్డి, రఘునందన్ రెడ్డి, మాజీ ఎంపీ రంజిత్ రెడ్డి పిఆర్ఓ కాటం శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## నవజీవన్ నగర్‌లో ఘనంగా గణేష్ పూజలు

అన్నదానాన్ని ప్రారంభించిన మాజీ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి



**కూకట్ పల్లి, రాజముద్ర న్యూస్:** కూకట్పల్లి నియోజకవర్గం బాలానగర్ డివిజన్ వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని బాలానగర్ డివిజన్ పరిధిలోని నవజీవ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో బాలానగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా ప్రతిష్ఠించిన వినాయకుడికి పూజలు నిర్వహించి, హారతి సమర్పించారు. అనంతరం భక్తుల కోసం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆవుల రవీందర్ రెడ్డి మాట్లాడుతూ, వినాయక చవితి పర్వదినం ప్రజలందరికీ శుభాలను, సుఖసంతోషాలను అందించాలని ఆకాంక్షించారు. కాలనీ సంక్షేమం కోసం వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు చేస్తున్న కార్యక్రమాలను అభినందించారు. ఈ కార్యక్రమంలో నవజీవ నగర్, అసోసియేషన్ సభ్యులు, బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.

## గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలి

డి.ఎస్.పి మధుసూదన్



**రామారెడ్డి, రాజముద్ర న్యూస్:** రామారెడ్డి మండలం కేంద్రంతో పాటు అన్ని గ్రామాలలోగణేష్ ఉత్సవాల గురించి పోలీస్ స్టేషన్లో మీటింగ్ ఏర్పాటు చేసి ముఖ్య అతిథులుగా డి.ఎస్.పి మధుసూదన్, సీఐ శ్రీధర్ గౌడ్ హాజరై వారు మాట్లాడుతూ గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా ఎలాంటి గొడవలు అల్లర్లు లేకుండా నిర్వహించుకోవాలని, అలాగే డీజే లకు పర్మిషన్ లేనందున ఎవరు కూడా డీజీలు పెట్టకూడదని అన్నారు, ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నాగేశ్వర్ గుప్తా, కరెంటు ఏ ఈ సుధాకర్, అన్ని గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు, యువజన సంఘం నాయకులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు, అనంతరం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు, చెప్పిన సూచనలను ఎస్సై మురళి తప్పకుండా పాటించాలని తెలిపారు.

भारत सरकार GOVERNMENT OF INDIA

MINISTRY OF CORPORATE AFFAIRS GOVERNMENT OF INDIA

# భారత ప్రభుత్వ మినిస్ట్రీ ఆఫ్ కార్పొరేట్ అఫైర్స్ మధ్యవర్తి,కన్సిలేటర్‌గా
# డా. నందిమండలం వేణు నియామకం

- తరాలుగా పెండింగ్‌లో ఉన్న కేసులకు మధ్యవర్తిత్వంతో పరిష్కారం
- భారత మధ్యవర్తిత్వ మండలి ఏర్పాటు కీలక పరిణామం
- న్యాయవ్యవస్థపై భారాన్ని తగ్గించడమే లక్ష్యం.. మధ్యవర్తిత్వ సేవల విస్తరణకు ప్రాధాన్యం
- న్యాయ సలహాలలో మధ్యవర్తిగా నా వంతు కృషి చేస్తా: తెలంగాణ హైకోర్టు ప్రముఖ న్యాయవాది డా. నంది మండలం వేణు

**హైదరాబాద్, సెప్టెంబర్ 19, రాజముద్ర న్యూస్:** దేశ వ్యాప్తంగా సంవత్సరాల తరబడి పెండింగ్‌లో ఉన్న కేసులకు ప్రత్యామ్నాయ పరిష్కార మార్గాలను అందుబాటులోకి తీసుకురావడంలో భాగంగా భారత మధ్యవర్తిత్వ మండలి ఏర్పాటు చేయడం న్యాయవ్యవస్థలో కీలక పరిణామంగా భావిస్తున్నారు. మధ్యవర్తిత్వ చట్టం–2023 అమలులోకి వచ్చిన అనంతరం, మధ్యవర్తిత్వ వ్యవస్థను మరింత పటిష్టం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలు వివాదాల సత్వర పరిష్కారంపై ఆశలు రేకెత్తిస్తున్నాయి. అయితే మండలి ఏర్పాటుతోనే పెండింగ్ కేసుల సమస్య పూర్తిగా పరిష్కారం కాదని, ఇందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు, నిపుణులైన మధ్యవర్తులు, సమర్థవంతమైన పర్యవేక్షణ వ్యవస్థలు కీలకమని న్యాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

**కోట్లాది కేసుల పెండింగ్..**
**ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి**

దేశంలోని న్యాయస్థానాల్లో కోట్లాది కేసులు పెండింగ్‌లో ఉండటం న్యాయవ్యవస్థ ఎదుర్కొంటున్న ప్రధాన సవాళ్లలో ఒకటిగా నిలుస్తోంది. ముఖ్యంగా దిగువస్థాయి న్యాయస్థానాల్లో కేసుల భారం అధికంగా ఉండటంతో కక్షిదారులు సుదీర్ఘ కాలం న్యాయం కోసం వేచి చూడాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. కోర్టుల్లో కేసుల విచారణకు పట్టే సమయం, న్యాయపరమైన ఖర్చులు సామాన్య ప్రజలకు ఇబ్బందికరంగా మారుతున్నాయి. ఈ నేపథ్యంలో మధ్యవర్తిత్వం ద్వారా వివాదాలను కోర్టు వెలుపల పరిష్కరించుకునే అవకాశాలను విస్తరించడం ద్వారా న్యాయస్థానాలపై ఒత్తిడిని తగ్గించవచ్చనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయ వివాద పరిష్కార విధానాలకు ప్రాధాన్యం ఇస్తోంది. వివాదంలో ఉన్న రెండు పక్షాల మధ్య పరస్పర అంగీకారంతో పరిష్కారం సాధించేందుకు మధ్యవర్తిత్వం ఒక వేదికగా పనిచేస్తుంది.

**మధ్యవర్తిత్వ విధానంలో ఎదురయ్యే సవాళ్లు**

మధ్యవర్తిత్వ మండలి ఏర్పాటు స్వాగతించదగిన పరిణామమే అయినప్పటికీ, దాని సమర్థవంతమైన అమలుకు అనేక సవాళ్లు ఎదురయ్యే అవకాశం ఉంది. దేశవ్యాప్తంగా తగిన సంఖ్యలో నైపుణ్యం కలిగిన మధ్యవర్తులను అందుబాటులోకి తీసుకురావడం, వారికి ప్రమాణబద్ధమైన శిక్షణ అందించడం, జిల్లా స్థాయిలో సేవలను విస్తరించడం వంటి అంశాలపై దృష్టి సారించాల్సి ఉంటుంది. అదేవిధంగా, వివాద పరిష్కార ప్రక్రియలో ఏ పక్షంపైనా ఒత్తిడి లేకుండా స్వచ్ఛంద అంగీకారానికి ప్రాధాన్యం ఇవ్వాలి. ధన, అధికార బలంతో బలహీన వర్గాలు రాజీకి ఒత్తిడికి గురికాకుండా పటిష్టమైన పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. మధ్యవర్తుల నిష్పక్షికత, పారదర్శకత, నైతిక ప్రమాణాలను కచ్చితంగా అమలు చేయడం ద్వారా ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందించవచ్చు.

**జిల్లా స్థాయికి మధ్యవర్తిత్వ సేవల విస్తరణ అవసరం**



ప్రస్తుతం న్యాయ సేవలు, ప్రత్యామ్నాయ వివాద పరిష్కార కేంద్రాలు ప్రధానంగా పట్టణ ప్రాంతాల్లో అందుబాటులో ఉండే పరిస్థితులను అధిగమించాల్సిన అవసరం ఉంది. గ్రామీణ ప్రాంతాలు, చిన్న పట్టణాలు, జిల్లా కేంద్రాల్లో మధ్యవర్తిత్వ సేవలను విస్తరించినప్పుడే సామాన్య ప్రజలకు ప్రయోజనం చేకూరుతుంది. వాణిజ్య వివాదాలు, ఆస్తి సంబంధిత సమస్యలు, కుటుంబ వివాదాలు వంటి చట్టపరంగా మధ్యవర్తిత్వానికి అనుకూలమైన అంశాల్లో సమర్థవంతమైన పరిష్కార మార్గాలను అందుబాటులోకి తీసుకురావాలి. అయితే తీవ్రమైన నేరాలు, ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన అంశాలు, చట్టపరంగా రాజీకి అనుమతి లేని వివాదాలను సంబంధిత నిబంధనలకు అనుగుణంగా పరిష్కరించాల్సి ఉంటుంది.

**తెలంగాణ హైకోర్టు ప్రముఖ న్యాయవాది డా. నందిమండలం వేణుకు బాధ్యతలు**

ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వానికి చెందిన కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ పరిధిలో ఎం ప్యానెల్డ్ మధ్యవర్తిగా ప్రఖ్యాత తెలంగాణ హైకోర్టు న్యాయవాది ప్రముఖ డా. నందిమండలం వేణు నియమితులైనట్లు సమాచారం. మధ్యవర్తిత్వ సేవల ద్వారా వివాదాల పరిష్కారానికి సహకరించే బాధ్యతను ఆయన స్వీకరించారు. తనను మధ్యవర్తిగా నియమించినందుకు కేంద్ర ప్రభుత్వం, కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు డా. నందిమండలం వేణు కృతజ్ఞతలు తెలిపారు. న్యాయస్థానాలపై పెరుగుతున్న కేసుల భారాన్ని తగ్గించే దిశగా చిత్తశుద్ధితో కృషి చేస్తానని పేర్కొన్నారు. మధ్యవర్తిత్వం, వివాద పరిష్కారానికి సంబంధించిన అంశాల్లో తనను సంప్రదించవచ్చని ఆయన తెలిపారు.

**న్యాయవ్యవస్థలో మార్పుకు ఆచరణే కీలకం**

మధ్యవర్తిత్వ మండలి ఏర్పాటుతో దేశంలో ప్రత్యామ్నాయ వివాద పరిష్కార విధానానికి సంస్థాగత బలం చేకూరే అవకాశం ఉంది. అయితే పెండింగ్ కేసుల సంఖ్యను తగ్గించడంలో మండలి ఎంతవరకు ప్రభావవంతంగా పనిచేస్తుందనేది దాని అమలు విధానం, అందుబాటులో ఉండే వనరులు, శిక్షణ పొందిన మధ్యవర్తుల సంఖ్య, న్యాయవ్యవస్థతో సమన్వయం వంటి అంశాలపై ఆధారపడి ఉంటుంది.ప్రజలకు సత్వర, సులభతర న్యాయం అందించాలంటే మధ్యవర్తిత్వాన్ని కేవలం చట్టపరమైన వ్యవస్థగా కాకుండా, ప్రజలకు అందుబాటులో ఉండే విశ్వసనీయ సేవగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉంది. పారదర్శకత, నిష్పాక్షికత, చట్టబద్ధతకు ప్రాధాన్యం ఇస్తూ మండలి పనిచేసినప్పుడే మధ్యవర్తిత్వ వ్యవస్థ ఆశించిన ఫలితాలను అందించే అవకాశం ఉంటుంది. మరిన్ని న్యాయ సలహాల కోసం ఈ క్రింది నెంబర్లలో సంప్రదించవచ్చు

**ఫోన్ నెంబర్: 8008045577.**

## మధ్యవర్తిత్వ మండలి ప్రధాన బాధ్యతలు

మధ్యవర్తిత్వ వ్యవస్థలో ప్రమాణాలను నెలకొల్పడం, సేవలను పర్యవేక్షించడం, మధ్యవర్తులకు శిక్షణ అందించడం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంటుంది. ఈ క్రమంలో మండలి పరిధిలో చేపట్టాల్సిన ముఖ్యమైన బాధ్యతలు కింది విధంగా ఉన్నాయి.

- మధ్యవర్తిత్వ సేవలందించే సంస్థలకు గుర్తింపు, పర్యవేక్షణ వ్యవస్థను అభివృద్ధి చేయడం.
- మధ్యవర్తుల నమోదు, అర్హతా ప్రమాణాలు, శిక్షణా విధానాలను రూపొందించడం.
- సంస్థాగత వివాద పరిష్కార విధానాలను ప్రోత్సహించడం.
- ఆన్‌లైన్ మధ్యవర్తిత్వ సేవలకు అవసరమైన నియమ నిబంధనలను రూపొందించడం.
- దేశవ్యాప్తంగా మధ్యవర్తిత్వ కేంద్రాల విస్తరణకు చర్యలు చేపట్టడం.
- మధ్యవర్తిత్వానికి సంబంధించిన విధానాలపై ప్రభుత్వం, సంబంధిత వర్గాలకు సలహాలు అందించడం.

## గోకుల్ తండాలో ఉచిత వైద్య ఆరోగ్య శిబిరం

డాక్టర్ సురేష్



**రామారెడ్డి, రాజముద్ర న్యూస్:** రామారెడ్డి మండలం గోకుల్ తండా గ్రామంలో ఉచిత వైద్య ఆరోగ్య శిబిరం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ కేతావత్ మోహన్ , పాలకవర్గ సభ్యులు ప్రారంభించారు. వైద్య శిబిరంలో జ్వరంతో బాధపడుతున్న సుమారు 15 మంది రోగులకు డెంగ్యూ , మలేరియా రక్త పరీక్షలు నిర్వహించడం జరిగింది.ప్రజలకు వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత దోమల నియంత్రణ చర్యలపై అవగాహన కల్పించారు. దోమల వృద్ధి చెందకుండా పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు.

అలాగే 30 సంవత్సరాలు పైబడిన వారందరికీ రక్తపోటు, రక్తంలో చక్కెర , పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల్లో కొత్తగా 2 మధుమేహ కేసులు, 3 అధిక రక్తపోటు కేసులు గుర్తించబడ్డాయి. గుర్తించిన కేసుల వివరాలను సంబంధిత ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయడం జరిగింది.కార్యక్రమంలో డా. రమ్య , ఉపసర్పంచ్ మంజుల, గ్రామ పంచాయతీ కార్యదర్శి రాకేష్,ఏఎన్ఎం పద్మ, ఆశా కార్యకర్తలు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ కేసులతో వేధిస్తున్నారు..

బాధితుల ఆవేదన

**ఖమ్మం, రాజముద్ర న్యూస్:** అక్రమ కేసులతో కూసుమంచి ఎస్ఐ వేధిస్తున్నారని కూసుమంచి మండలం కేసవాపురం గ్రామానికి చెందిన మందపల్లి శ్రీనివాసరావు, రజనీ, మందపల్లి రాధాకృష్ణ ఆరోపించారు. ఖమ్మంలోని ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. తమ గ్రామానికి చెందిన పోటు ప్రదీప్, పోటు తిరుమలరావు అనే ఇద్దరు వ్యక్తులు రాళ్లు, కర్రలతో తమ భూమిలోకి వచ్చి గొడవ చేశారని, వారిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని తెలిపారు. పైగా తామే దాడి చేశామంటూ అసత్య ఆరోపణలతో ప్రదీప్, తిరుమలరావు తమపై కూసుమంచి పోలీసులకు ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు. ఈ ఘటనపై తాము డీజీపీకి 03.11.2025న ఫిర్యాదు చేశామని తెలిపారు. ఈ విషయం తెలిసి కక్ష సాధింపు చర్యగా కూసుమంచి ఎస్ఐ తమపై అక్రమ సెక్షన్లతో కేసు నమోదు చేశారని, ఇటీవల కోర్టు నుంచి ఈ కేసుకు సంబంధించి ఛార్జిషీట్ వచ్చిందంటూ తమను స్టేషన్‌కు పిలిపించారని ఆవేదన వ్యక్తం చేశారు. తహసీల్దార్, సర్వేయర్ గ్రామానికి వచ్చి విచారణ చేసి తమకు వ్యతిరేకంగా, ప్రదీప్‌కు అనుకూలంగా రిపోర్ట్ ఇచ్చారని ఆరోపించారు. తప్పుడు సర్వే నంబర్లతో ఎస్సారెస్పీ కాలువ ఉన్న భూమిని మట్టిరోడ్డుగా మాత్రమే చూపుతూ అధికారులు తప్పుడు నివేదికలు తయారు చేశారని పేర్కొన్నారు. తమకు జరిగిన అన్యాయంపై సమగ్ర విచారణ జరిపి, అక్రమ కేసులను తొలగించి న్యాయం చేయాలని వారు కోరారు.




## నేలకొండపల్లిలో ధరల మంట.. భగ్గుమంటున్న సామాన్యుడి జేబు

**అదుపు తప్పిన వ్యాపారులు.. అటువైపు కన్నెత్తి చూడని అధికారులు.. నిలువు దోపిడీతో విలవిల్లాడుతున్న ప్రజలు**

**ఖమ్మం రాజముద్ర న్యూస్:** నేలకొండపల్లి మండల కేంద్రంలో ప్రస్తుతం ఎక్కడ విన్నా ఒక్కటే మాట.. "అయ్యో.. ఇంత రేటా!" ఉదయం టిఫిన్ తినాలన్నా, మధ్యాహ్నం కూరగాయలు కొనాలన్నా, సాయంత్రం పిల్లలకు ఏదైనా తినుబండారం కొనాలన్నా సామాన్యుడి జేబుకు చిల్లు పడుతోంది. ధరలు ఆకాశాన్ని తాకుతుంటే, అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

**టిఫిన్ బండ్ల దగ్గర కూడా దోపిడీయే..**

ఒకప్పుడు పేదవాడి కడుపు నింపే టిఫిన్ సెంటర్ ఇప్పుడు భారంగా మారింది. రెండేళ్ల క్రితం వరకు రూ.20కే వచ్చే పూరీ ప్లేట్, ఇడ్లీ ప్లేట్ ఇప్పుడు రూ.30 నుంచి రూ.40 పలుకుతోంది. దోశ రేటు రూ.50 దాటింది. టీ, కాఫీ ధరలు సైతం రూ.10 నుంచి రూ.15కు చేరాయి. "రేట్లు పెరిగాయి సార్.. ఏం చేస్తాం" అంటూ నిర్వాహకులు చేతులెత్తేస్తున్నారు. వేసవిలో దాహం తీర్చే కొబ్బరి బోండాం పరిస్థితి మరీ దారుణం. గతంలో లీటర్ కొబ్బరి నీళ్లు రూ.80 ఉంటే, ఇప్పుడు ముక్క రూ.60 నుంచి రూ.80, లీటర్ రూ.180 నుంచి రూ.200 వరకు వసూలు చేస్తున్నారు. "వర్షాలు లేవు, కొబ్బరికాయలు రావడం లేదు" అనే మాటను అడ్డం పెట్టుకుని విచ్చలవిడిగా దోచుకుంటున్నారు.

**కారణం వర్షా భావమా? వ్యాపారుల కృత్రిమ కొరతనా?**

ఈ ఏడాది ఎల్ నినో ప్రభావంతో వర్షాలు సరిగా పడకపోవడం, వరి, కూరగాయల దిగుబడి తగ్గడం వాస్తవమే. కానీ దీనిని ఆసరాగా చేసుకుని కొందరు



వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టిస్తున్నారని రైతులు, వినియోగదారులు ఆరోపిస్తున్నారు. హోల్‌సేల్ మార్కెట్లో తక్కువకే కొని, రిటైల్‌లో మాత్రం భారీ ధరకు అమ్ముతున్నారని చెబుతున్నారు.

**తోపుడు బండ్ల వెనుక అద్దెల గోల..**

మండల కేంద్రంలోని ప్రధాన రోడ్డు పక్కన తోపుడు బండ్లు పెట్టుకునే చిరు వ్యాపారుల దయనీయ స్థితి మరో కోణం. షాపు యజమానులు తమ దుకాణాల ముందు బండి పెట్టుకోవడానికి నెలకు రూ.9,000 నుంచి రూ.10,000 వరకు వసూలు చేస్తున్నారని తోపుడు బండి నిర్వాహకులు వాపోతున్నారు. "అద్దె కట్టాలి, కరెంట్ బిల్లు కట్టాలి.. మేమేం చేయాలి? అందుకే రేట్లు పెంచక తప్పడం లేదు" అంటూ వారు తమ గోడు వెళ్లబోసుకుంటున్నారు. చివరకు ఈ భారం అంతా వినియోగదారుడిపైనే పడుతోంది.

**ప్రశ్నించిన విలేకరిపై దాడి.. ప్రజాస్వామ్యానికి సిగ్గుచేటు!**

ధరల దోపిడీపై వార్తలు రాసిన విలేకరులపై కొందరు వ్యాపారులు నోరు పారేసుకుంటున్నారు. "మా బతుకు మీద కొట్టి వార్తలు రాస్తారా? మీ అంతు చూస్తాం" అంటూ శాపనార్థాలు పెడుతూ, బెదిరింపులకు దిగుతున్నారని విలేకరులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమాజంలోని లోపాలను ఎత్తిచూపాల్సిన పాత్రికేయులకే రక్షణ లేకపోతే ఎలా? అని మేధావులు ప్రశ్నిస్తున్నారు.

**అధికారులు ఏం చేస్తున్నారు?**

పౌరసరఫరాల శాఖ, మార్కెటింగ్ శాఖ, పంచాయతీ అధికారులు ధరల నియంత్రణపై దృష్టి సారించడం లేదనే విమర్శలు ఉన్నాయి. ప్రభుత్వం ధరలు తగ్గిస్తే ఇక్కడ తగ్గవు.. పెంచితే మాత్రం వెంటనే పెరిగిపోతాయి. ఈ దోపిడీకి అడ్డుకట్ట వేయాల్సిన అధికారులు కార్యాలయాలకే పరిమితమవుతున్నారని ప్రజలు మండిపడుతున్నారు.

**ప్రజల డిమాండ్ ఏంటి?**

నేలకొండపల్లిలోని హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, కూరగాయల మార్కెట్లలో ఆకస్మిక తనిఖీలు చేయాలి. ధరల పట్టికను ప్రతి దుకాణం ముందు తప్పనిసరిగా ప్రదర్శించేలా చర్యలు తీసుకోవాలి. అధిక ధరలకు విక్రయించే వారిపై జరిమానాలు విధించాలి. తోపుడు బండి వ్యాపారుల నుంచి అక్రమ అద్దెలు వసూలు చేస్తున్న వారిపై విచారణ జరపాలి. రోజువారీ కూలీలు, చిన్న ఉద్యోగులు, మధ్యతరగతి కుటుంబాలు ఈ ధరల భారంతో అల్లాడిపోతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి నేలకొండపల్లిపై ప్రత్యేక దృష్టి సారించకపోతే పరిస్థితి మరింత దిగజారుతుందని సామాజికవేత్తలు హెచ్చరిస్తున్నారు.

## షాబాద్‌లో కుసుమ విత్తనాల పంపిణీ చేసిన ఎమ్మెల్యే యాదయ్య...

- రైతులకు కుసుమ సాగుపై అవగాహన....
- లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ
- పాల్గొన్నగ్రంథాలయ చైర్మన్ మధుసూదన్ రెడ్డి



**షాబాద్, రాజముద్ర న్యూస్:** షాబాద్ రైతులు నూనెగింజల పంటల సాగుపై దృష్టి సారించి, అధిక దిగుబడులు సాధించేలా ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని చేవెళ్ల శాసన సభ్యులు కాలె యాదయ్య అన్నారు. జాతీయ తినదగని నూనెల మిషన్–నూనెగింజల మిషన్ 2026–27 కార్యక్రమంలో భాగంగా శుక్రవారం షాబాద్ రైతు వేదికలో కుసుమ విత్తనాల పంపిణీ, కుసుమ పంట సాగుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కాలే యాదయ్యతో పాటు రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి హాజరై రైతులకు కుసుమ విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రైతులకు కుసుమ పంట సాగు విధానం, విత్తనాల ఎంపిక, సాగులో పాటించాల్సిన యాజమాన్య పద్ధతులు, పంట సంరక్షణ, దిగుబడి పెంపునకు తీసుకోవాల్సిన చర్యలపై వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన కల్పించారు. నూనెగింజల పంటల సాగును ప్రోత్సహించడం ద్వారా రాష్ట్రంలో నూనెగింజల ఉత్పత్తిని పెంచడంతో పాటు రైతులకు మెరుగైన ఆదాయం లభించేలా ప్రభుత్వం పలు కార్యక్రమాలను అమలు చేస్తోందని వారు తెలిపారు.కార్యక్రమంలో భాగంగా కుసుమ లక్ష్మీప్రియ రకం ధ్రువీకరించిన విత్తనాలను ఎంపిక చేసిన రైతులకు పంపిణీ చేశారు. మొత్తం 20 క్వింటాళ్ల కుసుమ విత్తనాలను 200 హెక్టార్ల విస్తీర్ణానికి అందజేశారు. హెక్టారుకు 10 కిలోల చొప్పున రైతులకు విత్తనాలను పంపిణీ చేశారు. నాణ్యమైన ధ్రువీకరించిన విత్తనాలను వినియోగించి శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేపడితే మంచి దిగుబడులు సాధించే అవకాశం ఉంటుందని అధికారులు రైతులకు వివరించారు.అనంతరం షాబాద్ మండలానికి సంబంధించిన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను లబ్ధిదారులకు ప్రజాప్రతినిధులు అందజేశారు. ఆపదలో ఉన్న కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సహాయం అందిస్తూ ప్రభుత్వం అండగా నిలుస్తోందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్దార్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పిసరి సురేందర్‌రెడ్డి, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్, మండల వ్యవసాయ అధికారి దండెం విజయచంద్ర, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పెంటారెడ్డి, సర్పంచులు అశోక్, రాజేందర్‌రెడ్డి, సందీప్, నవనీత స్వామి, స్వరూప మహేందర్‌గౌడ్, శాంతమ్మ యాదయ్య, పోచయ్య, మంగమ్మ, సవిత, సుభాష్‌చంద్ర, గోపాల్, సబితా గోవర్ధన్ రెడ్డి, నర్సింహులు, స్వాతి మాణిక్యం తదితరులు పాల్గొన్నారు. ఎఫ్‌పీఓ ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.



# ఐదు ఓవర్లలోనే ఫినిష్

## భారత్ సరికొత్త రికార్డు!

## జపాన్‌పై ఎనిమిది వికెట్ల ఘన విజయం

**నిషిన్, సెప్టెంబర్ 18 :** ఆసియా క్రీడల్లో భారత మహిళల క్రికెట్ జట్టు అదరగొట్టింది. జపాన్‌తో జరిగిన క్వార్టర్ ఫైనల్లో ఎనిమిది వికెట్ల తేడాతో ఘన విజయం సాధించి సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. తొలుత భారత బౌలర్ల ధాటికి జపాన్ 19.5 ఓవర్లలో 57 పరుగులకే ఆలౌట్ కాగా.. భారత్ కేవలం ఐదు ఓవర్లలో రెండు వికెట్లకు 59 పరుగులు చేసి మ్యాచ్‌ను ముగించింది. 90 బంతులు మిగిలుండగానే సాధించిన ఈ విజయం భారత మహిళల టీ20 అంతర్జాతీయ చరిత్రలో బంతుల పరంగా అతిపెద్ద విజయంగా నమోదైంది. జపాన్‌ను తక్కువ స్కోరుకే కట్టడి చేయడంలో శ్రీ చరణి కీలక పాత్ర పోషించారు. నాలుగు ఓవర్లలో కేవలం 10 పరుగులిచ్చి నాలుగు వికెట్లు పడగొట్టారు. షఫాలీ వర్మ రెండు వికెట్లు తీయగా, దీప్తి శర్మ, శ్రేయాంక పాటిల్ చెరో వికెట్ సాధించారు. జపాన్ తరఫున అయాకా కాటో-స్టాఫర్డ్ 25 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచారు. 58 పరుగుల లక్ష్య ఛేదనలో కమలిని డకౌట్ కాగా, భారతి ఫుల్మాలి ఆరు పరుగులకు వెనుదిరిగారు. అయితే షఫాలీ వర్మ జపాన్ బౌలర్లపై విరుచుకుపడ్డారు. కేవలం 15 బంతుల్లో ఆరు ఫోర్లు, రెండు సిక్సర్లతో అజేయంగా 40 పరుగులు చేశారు. రిచా ఘోష్ ఆరు బంతుల్లో 12 పరుగులతో నాటౌట్‌గా నిలిచారు. ఐదో ఓవర్ చివరి బంతిని షఫాలీ సిక్సర్‌గా మలిచి విజయాన్ని ఖాయం చేశారు. ఈ విజయంతో భారత్ తన పేరిటే ఉన్న పాత రికార్డును అధిగమించింది. 2022లో థాయ్‌లాండ్‌పై 84 బంతులు మిగిలుండగానే గెలవగా.. ఇప్పుడు జపాన్‌పై ఏకంగా 90 బంతులు మిగిలుండగానే విజయాన్ని అందుకుంది. సెప్టెంబర్ 20న జరిగే సెమీఫైనల్లో భారత్ బంగ్లాదేశ్‌తో తలపడనుంది.

# ఆనందికి స్వర్ణం, కాంస్యం

**కమాన్‌పూర్, సెప్టెంబర్ 17:** తెలంగాణ అథ్లెట్ నల్లవెల్లి ఆనంది సౌత్ జోన్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో రెండు పతకాలతో ఆకట్టుకుంది. పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ మండల కేంద్రానికి చెందిన ఆనంది అండర్-18 బాలికల 400 మీటర్ల విభాగంలో స్వర్ణం, 200 మీటర్ల పరుగులో కాంస్యం సాధించింది. పుదుచ్చేరిలో గురువారం జరిగిన 400 మీటర్ల ఫైనల్లో అందరికంటే వేగంగా 56.42 సెకండ్ల టైమింగ్‌తో అగ్రస్థానంలో నిలిచింది. 200 మీటర్ల తుదిపోరులో 25.66 సెకండ్లలో మూడో స్థానం సాధించింది.



# మహిళా అథ్లెట్.. పురుష కోచ్‌కు ఒకే గది!

## నాగోయాలో భారత బృందానికి వసతి చిక్కులు

**నాగోయా, సెప్టెంబర్ 18 :** ఆసియా క్రీడల కోసం జపాన్‌లోని నాగోయాకు చేరుకున్న భారత బృందానికి వసతి ఏర్పాట్లలో వరుస చిక్కులు ఎదురవుతున్నాయి. తాజాగా భారత జిమ్నాస్ట్ ప్రణతి నాయక్, ఆమె పురుష కోచ్ అశోక్ మిశ్రాకు నిర్వాహకులు ఒకే గదిని కేటాయించడం గందరగోళానికి దారితీసింది. దీనిపై ఇద్దరూ వెంటనే అభ్యంతరం వ్యక్తం చేసి స్థానిక నిర్వాహకులు, భారత బృందం అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. గంటలపాటు ప్రయత్నించిన అనంతరం భారత ఒలింపిక్ సంఘం జోక్యంతో ప్రణతి, మిశ్రాకు వేర్వేరు వసతి ఏర్పాట్లు చేసినట్లు సమాచారం. ఈ ప్రక్రియ అర్ధరాత్రి దాటినా కొనసాగగా.. సుమారు రాత్రి 1.30 గంటలకు ప్రత్యామ్నాయ గది ఏర్పాట్లు పూర్తయ్యాయి. అయితే కోచ్ అశోక్ మిశ్రాకు అక్కడితో సమస్య తీరలేదు. ప్రత్యేక గది తాళాలు తీసుకునేందుకు వెళ్లగా హోటల్ రిజిస్టర్‌లో ఆయన బుకింగ్ కనిపించలేదు. అధికారిక వివరాల్లో ఆయన పేరులోని ఒక అక్షరం నమోదు కాకపోవడంతో ఈ సమస్య తలెత్తినట్లు సమాచారం. బుకింగ్‌ను గుర్తించి, అక్రిడిటేషన్‌ను ధ్రువీకరించేందుకు మరో 45 నిమిషాలు పట్టడంతో రాత్రి 2 గంటల తర్వాతే ఆయన గదికి చేరుకోగలిగారు. ఈ ఘటనపై ప్రణతి నాయక్ స్పందిస్తూ వసతి విషయంలో గందరగోళం జరిగిన మాట వాస్తవమేనని, రాత్రి 2 గంటల సమయంలో సమస్య





పరిష్కారమైనట్లు తెలిపారు. భారత బృందం నాగోయాకు చేరుకున్నప్పటి నుంచి మరికొందరు అథ్లెట్లు కూడా గదుల కేటాయింపు కోసం గంటల తరబడి వేచి చూడాల్సి వచ్చినట్లు సమాచారం. శిక్షణకు వెళ్లే ఏర్పాట్లు, పోషకాహారం విషయంలోనూ ఇబ్బందులు ఎదురైనట్లు తెలుస్తోంది. భారత కబడ్డీ బృందానికీ హోటల్ గదుల కేటాయింపు, చెక్‌ఇన్‌లో సమస్యలు ఎదురైనట్లు సమాచారం. పోటీలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో వసతి, ఇతర ఏర్పాట్లలో ఇకపై ఇలాంటి సమన్వయ లోపాలు తలెత్తకుండా చూడాలని అథ్లెట్లు, కోచ్‌లు కోరుతున్నారు.

# కాటేరమ్మ కొడుకుల విశ్వరూపం

## బాదుడే బాదుడు!

## నిన్న అభిషేక్.. నేడు ట్రావిస్ హెడ్

### 84 బంతుల్లో 112 పరుగులతో హెడ్ విధ్వంసం

### 30 బంతుల్లోనే అభిషేక్ రికార్డు శతకం




**హరారే, సెప్టెంబర్ 18 :** ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ తరఫున ప్రత్యర్థి బౌలర్లను హడలెత్తించిన ట్రావిస్ హెడ్, అభిషేక్ శర్మ ఇప్పుడు తమ దేశాల తరఫున అంతర్జాతీయ క్రికెట్‌లోనూ అదే దూకుడు చూపిస్తున్నారు. నిన్న అఫ్ఘానిస్థాన్‌పై అభిషేక్ రికార్డు శతకంతో విరుచుకుపడితే.. తాజాగా జింబాబ్వేపై ట్రావిస్ హెడ్ సెంచరీతో చెలరేగిపోయాడు. దీంతో ఎస్‌ఆర్‌హెచ్ అభిమానులు తమదైన శైలిలో వీరిద్దరినీ 'కాటేరమ్మ కొడుకులు' అంటూ సోషల్ మీడియాలో హోరెత్తిస్తున్నారు. హరారే వేదికగా శుక్రవారం జింబాబ్వేతో జరిగిన రెండో వన్డేలో ట్రావిస్ హెడ్ 84 బంతుల్లో 15 ఫోర్లు, మూడు సిక్సర్లతో 112 పరుగులు చేశాడు. కేవలం 75 బంతుల్లోనే శతకం పూర్తి చేశాడు. హెడ్ విధ్వంసానికి కెప్టెన్ మిచెల్ మార్ష్ 53, కూపర్ కానొలీ 78 పరుగులతో తోడవడంతో ఆస్ట్రేలియా 50 ఓవర్లలో ఆరు వికెట్లకు 356 పరుగుల భారీ స్కోరు చేసింది. మరోవైపు గురువారం ఢిల్లీలో అఫ్ఘానిస్థాన్‌తో జరిగిన మూడో టీ20లో అభిషేక్ శర్మ కేవలం 30 బంతుల్లోనే శతకం బాది రికార్డు సృష్టించాడు. మొత్తం 34 బంతుల్లో తొమ్మిది ఫోర్లు, 11 సిక్సర్లతో 108 పరుగులు చేశాడు. ఇది భారత బ్యాటర్ సాధించిన అత్యంత వేగవంతమైన అంతర్జాతీయ టీ20 శతకం. పూర్తి సభ్య దేశాల మధ్య జరిగిన టీ20ల్లోనూ ఇదే అత్యంత వేగవంతమైన సెంచరీ. అభిషేక్ దెబ్బకు భారత్ 221 పరుగులు చేయగా.. అఫ్ఘానిస్థాన్‌ను 94 పరుగులకే కట్టడి చేసి 127 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఓపెనర్లుగా హెడ్-అభిషేక్ జోడీ ఎన్నోసార్లు పవర్‌ప్లేలో పరుగుల సునామీ సృష్టించింది. ఇప్పుడు ఒక్కరోజు వ్యవధిలోనే ఇద్దరూ తమ జాతీయ జట్ల తరఫున సెంచరీలతో చెలరేగడం ఆరెంజ్ ఆర్మీ అభిమానులకు ప్రత్యేక ఆనందాన్ని అందిస్తోంది. సోషల్ మీడియాలోనూ వీరిద్దరి బ్యాటింగ్‌ను పోలుస్తూ అభిమానుల పోస్టులు సందడి చేస్తున్నాయి.

# క్లీన్‌స్వీప్ చేసినా.. నంబర్ వన్‌కు ముప్పే!

## భారత్‌కు ఇంగ్లండ్ నుంచి గట్టి పోటీ




**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 18 :** అఫ్ఘానిస్థాన్‌ను టీ20 సిరీస్‌లో క్లీన్‌స్వీప్ చేసిన టీమిండియా ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌లో నంబర్ వన్ స్థానాన్ని నిలబెట్టుకున్నా.. ఇంగ్లండ్ నుంచి గట్టి పోటీ ఎదురవుతోంది. తాజా ర్యాంకింగ్స్‌లో భారత్, ఇంగ్లండ్ రెండూ 269 రేటింగ్ పాయింట్లతో సమంగా ఉన్నాయి. అయితే మొత్తం పాయింట్ల పరంగా భారత్ ముందుండటంతో అగ్రస్థానం కొనసాగుతోంది. ఐసీసీ అధికారిక పేజీలోనూ భారత్ ప్రస్తుతం 269 రేటింగ్‌తో నంబర్ వన్‌గా ఉంది. శ్రీలంకతో మూడు టీ20ల సిరీస్‌లో ఇంగ్లండ్ ఇప్పటికే తొలి రెండు మ్యాచ్‌లను గెలిచి 2--0తో సిరీస్‌ను సొంతం చేసుకుంది. రెండో మ్యాచ్‌లో ఆరు వికెట్ల తేడాతో నెగ్గిన ఇంగ్లండ్.. శనివారం మాంచెస్టర్‌లో జరిగే చివరి టీ20లోనూ విజయం సాధిస్తే ర్యాంకింగ్ లెక్కల్లో భారత్‌పై ఒత్తిడి మరింత పెరగనుంది. తాజా పట్టికలో భారత్ 269 రేటింగ్‌తో మొదటి స్థానంలో ఉండగా ఇంగ్లండ్ 269తో రెండో స్థానంలో ఉంది. ఆస్ట్రేలియా 260తో మూడో స్థానం, న్యూజిలాండ్ 247తో నాలుగో స్థానం, దక్షిణాఫ్రికా 243తో ఐదో స్థానంలో ఉన్నాయి. పాకిస్థాన్ 240, వెస్టిండీస్ 234, బంగ్లాదేశ్ 224 రేటింగ్ పాయింట్లతో తర్వాతి స్థానాల్లో కొనసాగుతున్నాయి. శ్రీలంక, అఫ్ఘానిస్థాన్ చెరో 220 రేటింగ్‌తో తొమ్మిది, పది స్థానాల్లో ఉన్నాయి. అఫ్ఘానిస్థాన్‌పై సిరీస్ విజయంతో అగ్రస్థానాన్ని కాపాడుకున్న భారత్‌కు ఇప్పుడు ఇంగ్లండ్ అత్యంత సమీపంలోకి వచ్చింది. దీంతో శ్రీలంక-ఇంగ్లండ్ చివరి టీ20 అనంతరం ర్యాంకింగ్ లెక్కలు ఎలా మారతాయన్నది ఆసక్తికరంగా మారింది.

# బీసీసీఐ కీలక నిర్ణయాలు



- ఐపీఎల్-2027పై స్పెషల్ ఫోకస్
- లైంగిక వేధింపుల నిరోధానికి కొత్త కమిటీ
- ఐపీఎల్ పాలక మండలిలో కొత్త నియామకాలు
- 20వ ఎడిషన్‌ను ఘనంగా నిర్వహించేందుకు ప్రణాళిక
- 2028 శతాబ్ది ఉత్సవాలకు ఇప్పటి నుంచే రోడ్‌మ్యాప్
- అంపైర్లు, మ్యాచ్ రిఫరీలకు వేతనాల పెంపు

**ముంబై, సెప్టెంబర్ 18 :** భారత క్రికెట్ నియంత్రణ మండలి 95వ వార్షిక సర్వసభ్య సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. బోర్డు పాలన, ఆర్థిక వ్యవహారాలు, మ్యాచ్ అధికారుల సంక్షేమం, ఐపీఎల్-2027 నిర్వహణతోపాటు బీసీసీఐ శతాబ్ది ఉత్సవాలకు సంబంధించిన ప్రతిపాదనలకు ఆమోదం తెలిపారు. క్రీడాకారులు, సిబ్బందికి సురక్షిత వాతావరణం కల్పించడంలో భాగంగా లైంగిక వేధింపుల నిరోధక విధానం కింద కొత్త అంతర్గత కమిటీ ఏర్పాటుకు సర్వసభ్య సమావేశం ఆమోదం తెలిపింది. క్రికెటర్ల వయసు నిర్ధారణ విధానంలో మరింత పారదర్శకత తీసుకొచ్చేందుకు ప్రతిపాదించిన మార్పులకూ పచ్చజెండా ఊపింది.

## ఐపీఎల్-2027పై ప్రత్యేక దృష్టి

ఐపీఎల్ పాలక మండలిలో అరుణ్ సింగ్ ధుమాల్, ఎం. ఖైరుల్ జమాల్ మజుందార్‌లను ప్రతినిధులుగా నియమించారు. 2027లో ఐపీఎల్ 20వ ఎడిషన్ జరగనున్న నేపథ్యంలో ఈ మైలురాయిని ప్రత్యేకంగా నిర్వహించేందుకు ఇప్పటి నుంచే ప్రణాళికలు రూపొందించాలని నిర్ణయించారు. బీసీసీఐ వందేళ్లు పూర్తి చేసుకోనున్న సందర్భంగా శతాబ్ది ఉత్సవాలను దేశవ్యాప్తంగా నిర్వహించేందుకు కూడా రోడ్‌మ్యాప్ సిద్ధం చేయనున్నారు. 2027 డిసెంబర్ నుంచి 2028 వరకు ఏడాది పొడవునా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించారు.

## అంపైర్లు, రిఫరీలకు తీపికబురు

అంపైర్లు, మ్యాచ్ రిఫరీల చెల్లింపులను పెంచడంతోపాటు వారి గ్రేడింగ్ వ్యవస్థను పునర్వ్యవస్థీకరించేందుకు ఆమోదం లభించింది. 2025--26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆడిట్ ఖాతాలు, 2026--27 వార్షిక బడ్జెట్‌తోపాటు తదుపరి ఆర్థిక సంవత్సరానికి ఆడిటర్ల నియామకానికీ బోర్డు ఆమోదముద్ర వేసింది. దివ్యాంగ క్రికెటర్ల అభివృద్ధిపైనా బీసీసీఐ ప్రత్యేక దృష్టి సారించింది. వారికి అవసరమైన వనరులు, మెరుగైన శిక్షణ, ఇతర సౌకర్యాలను కల్పించేందుకు రాష్ట్ర క్రికెట్ సంఘాలతో కలిసి సమగ్ర చర్యలు చేపట్టాలని నిర్ణయించింది.

# 'పెద్ది'ని దాటి.. ఆస్కార్ బరిలో 'గొంధల్'!

## భారత్ అధికారిక ఎంట్రీగా మరాఠి చిత్రం

## 33 చిత్రాల నుంచి ఎంపిక చేసిన జ్యూరీ

## పోటీలో 'పెద్ది', 'హనుమాన్ అంశ్', 'ధురంధర్'

## సంతోష్ దవాఖర్ దర్శకత్వంలో థ్రిల్లర్

## మార్చి 14న 99వ ఆస్కార్ వేడుకలు




**ముంబై, సెప్టెంబర్ 18** : ప్రతిష్ఠాత్మక 99వ అకాడమీ అవార్డులకు భారత్ తరఫున మరాఠి చిత్రం 'గొంధల్' అధికారిక ఎంట్రీగా ఎంపికైంది. సంతోష్ దవాఖర్ రచించి, దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని ఉత్తమ అంతర్జాతీయ ఫీచర్ ఫిల్మ్ విభాగానికి పంపుతున్నట్లు ఫిల్మ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా శుక్రవారం ప్రకటించింది. దేశవ్యాప్తంగా పరిశీలనకు వచ్చిన 33 చిత్రాల నుంచి జ్యూరీ 'గొంధల్'ను ఎంపిక చేసింది. ఈ పోటీలో తెలుగు నుంచి 'పెద్ది', 'ఇరుముడి', 'సింగ్ గీతం', 'ఎగ్సా' సహా నాలుగు చిత్రాలు ఉన్నాయి. హిందీ నుంచి 'ధురంధర్', 'ధురంధర్: ది రివెంజ్', 'హనుమాన్ అంశ్', 'బోర్డర్--2', 'ఇక్కిస్' తదితర చిత్రాలు పరిశీలనకు వచ్చాయి. మొత్తం 33 చిత్రాలను పరిశీలించిన అనంతరం జ్యూరీ మరాఠి చిత్రం 'గొంధల్' వైపు మొగ్గుచూపింది.

### సంప్రదాయం నేపథ్యంలో థ్రిల్లర్

మహారాష్ట్రలోని సంప్రదాయ 'గొంధల్' ఆచారాన్ని నేపథ్యంగా చేసుకుని ఈ చిత్రాన్ని రూపొందించారు. సంగీతం, నృత్యం, పురాణ కథనాలతో రాత్రంతా సాగే సంప్రదాయ ప్రదర్శన చుట్టూ కథ నడుస్తుంది. పెళ్లి వేడుకతో మొదలయ్యే కథ క్రమంగా కోరికలు, అసూయ, ద్రోహం, గ్రామంలో దాగున్న సంఘర్షణలను వెలికితీసే థ్రిల్లర్‌గా మారుతుంది. కిశోర్ కదమ్, ఇషితా దేశ్‌ముఖ్, యోగేశ్ సోహోని, నిషాద్ భోయిర్, అనుజ్ ప్రభు ప్రధాన పాత్రల్లో నటించారు. దర్శకుడు సంతోష్ దవాఖర్‌కు ఇదే తొలి ఫీచర్ చిత్రం. గోవాలో జరిగిన అంతర్జాతీయ చలనచిత్రోత్సవంలోనూ 'గొంధల్' ప్రత్యేక గుర్తింపు పొందింది. దవాఖర్‌కు సిల్వర్ పీకాక్ పురస్కారం దక్కింది. అయితే భారత్ అధికారిక ఎంట్రీగా ఎంపిక కావడం ఆస్కార్ నామినేషన్ ఖరారైనట్లు కాదు. అంతర్జాతీయ ఫీచర్ విభాగంలో వివిధ దేశాల నుంచి వచ్చిన చిత్రాలను అకాడమీ పరిశీలించి ముందుగా 15 చిత్రాలతో షార్ట్‌లిస్ట్‌ను, అనంతరం తుది ఐదు నామినేషన్లను ప్రకటిస్తుంది. 99వ అకాడమీ అవార్డుల వేడుక 2027 మార్చి 14న లాస్ ఏంజెల్స్‌లోని డాల్బీ థియేటర్‌లో జరగనుంది.



# ప్రెగ్నెన్సీలోనూ తగ్గేదేలే..

## దీపిక మరో సినిమాకు ఓకే?

## 'రాకా', 'కింగ్' షూటింగ్స్ పూర్తి చేసినట్లు టాక్

**ముంబై, సెప్టెంబర్ 18** : రెండోసారి తల్లి కాబోతున్న బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకొణె సినిమాలకు మాత్రం విరామం ఇచ్చే ఆలోచనలో లేనట్లు బాలీవుడ్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. గర్భవతిగా ఉన్న సమయంలోనూ 'రాకా', 'కింగ్' చిత్రాల షూటింగుల్లో పాల్గొని తనకు సంబంధించిన సన్నివేశాలను ఇప్పటికే పూర్తి చేసినట్లు సమాచారం. ఇప్పుడు మరో పెండింగ్ ప్రాజెక్టును పట్టాలెక్కించేందుకు సిద్ధమవుతున్నట్లు సినీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. ఇటీవల 'స్పిరిట్', 'కల్కి-2' ప్రాజెక్టుల నుంచి దీపిక తప్పుకోవడం చర్చనీయాంశమైంది. 'స్పిరిట్' విషయంలో ఆమె పెట్టిన కొన్ని షరతులపై చిత్రబృందంతో విభేదాలు తలెత్తినట్లు అప్పట్లో ప్రచారం జరిగింది. 'కల్కి-2' నుంచి తప్పుకోవడంపైనా పలు కథనాలు వెలువడ్డాయి. అయితే ఈ ప్రచారంలోని అన్ని అంశాలపై దీపిక స్వయంగా వివరణ ఇవ్వలేదు.ఆ తర్వాత 'రాకా', 'కింగ్' చిత్రాలకు ఆమె కమిట్ అయినట్లు సమాచారం. రెండోసారి తల్లి కాబోతున్నట్లు వెల్లడైనప్పటికీ షూటింగులకు విరామం ఇవ్వకుండా తన పోర్షన్లు పూర్తి చేసినట్లు బాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. 'రాకా'లో కొన్ని యాక్షన్ సన్నివేశాలను కూడా చిత్రీకరించినట్లు ప్రచారం జరుగుతోంది. అట్లీ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమాకు సంబంధించిన అప్‌డేట్ వచ్చే అవకాశముందనే టాక్ వినిపిస్తోంది. 'కింగ్'లో షారుఖ్ ఖాన్‌తో దీపిక మరోసారి తెర పంచుకోనుండగా, ఆమె పాత్ర పరిమితంగానే ఉంటుందని సమాచారం. ఇదిలా ఉండగా హాలీవుడ్ కామెడీ డ్రామా 'ది ఇంటర్న్' హిందీ రీమేక్‌ను మళ్లీ పట్టాలెక్కించే ప్రయత్నాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఈ ప్రాజెక్టుకు దీపిక దాదాపు ఆరేళ్ల క్రితమే అంగీకరించినప్పటికీ వివిధ కారణాలతో ముందుకు సాగలేదు. ఇప్పుడు మరోసారి ఈ సినిమాపై కదలిక మొదలైనట్లు బాలీవుడ్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఈ ప్రాజెక్టు కార్యరూపం దాల్చితే 'పీకూ' తర్వాత అమితాబ్ బచ్చన్, దీపికా పదుకొణె మరోసారి కలిసి నటించే అవకాశం ఉంటుంది. అయితే కొత్త ప్రాజెక్టు ప్రారంభం, షూటింగ్ తేదీలపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

# సౌందర్యను తలచుకుని ఆమని భావోద్వేగం





**హైదరాబాద్, సెప్టెంబరు 18** : దివంగత నటి సౌందర్యతో తనకున్న అనుబంధాన్ని నటి ఆమని భావోద్వేగంతో గుర్తుచేసుకున్నారు. సౌందర్య తనకు కేవలం సహనటి మాత్రమే కాదని, జీవితంలో ఎంతో సన్నిహితమైన స్నేహితురాలని తెలిపారు. వ్యక్తిగత విషయాలను సైతం తనతో పంచుకునేదని, తామిద్దరం మంచి స్నేహితులమని చెప్పారు. షూటింగ్‌లు లేని సమయంలో సౌందర్య తనను ఇంటికి పిలిచేదని ఆమని గుర్తు చేసుకున్నారు. తాను స్వయంగా నిర్మిస్తున్న సినిమా చిత్రీకరణకు వచ్చి ప్రోత్సహించాలని కూడా సౌందర్యను కోరినట్లు తెలిపారు. అయితే ఆమె మరణవార్త తనను తీవ్రంగా కలచివేసిందన్నారు. ఆ వార్త విన్న సమయంలో తాను నమ్మలేకపోయానని, షూటింగ్‌లో ఉండగా విషయం తెలియగానే చేతులు వణికాయని, మాట కూడా రాలేదని ఆమని చెప్పారు. సౌందర్యను చివరిసారి చూసేందుకు వెంటనే వెళ్లలేకపోయానని, ఆ దుఃఖాన్ని తట్టుకోలేనని భావించి నెల రోజుల తర్వాత ఆమె ఇంటికి వెళ్లినట్లు తెలిపారు. అక్కడ సౌందర్య తల్లి మాత్రమే ఉన్నారని, హాల్‌లో సౌందర్య, ఆమె తండ్రి, తమ్ముడు అమర్ ఫొటోలు కనిపించాయని గుర్తుచేసుకున్నారు. ఇటీవల బెంగళూరులోని సౌందర్య ఇంటికి వెళ్లినప్పుడు అది నిర్మానుష్యంగా మారి ఉండటం చూసి ఎంతో బాధపడ్డానని ఆమని ఆవేదన వ్యక్తం చేశారు. సౌందర్య వ్యక్తిత్వం గురించి మాట్లాడుతూ.. తెరపై ఎంత అందంగా కనిపించేదో, నిజ జీవితంలో అంతకంటే గొప్ప మనసున్న వ్యక్తి అని ఆమని కొనియాడారు. క్రమశిక్షణతో జీవించడం సౌందర్యకు అలవాటని, తన తండ్రి మాటకు ఎంతో విలువ ఇచ్చేదని గుర్తుచేసుకున్నారు. చిన్నతనంలో తండ్రి స్వీట్లు తినొద్దంటే వాటిని కూడా మానేసేదని చెప్పారు. ఇదే సందర్భంగా కార్తికేయ, ప్రకాష్ రాజ్, నాగార్జున, కమల్ హాసన్, రోజా తదితరులతో కలిసి పనిచేసిన అనుభవాలను కూడా ఆమని పంచుకున్నారు. కార్తికేయ పెద్ద సంభాషణలను సైతం ఒకే ప్రయత్నంలో చెప్పడం చూసి తాను ఆశ్చర్యపోయానని తెలిపారు.

# రాకేష్ మాస్టర్‌ను తలచుకున్న ఉదయభాను

**హైదరాబాద్, సెప్టెంబరు 18** : దివంగత నృత్య దర్శకుడు రాకేష్ మాస్టర్‌ను తలచుకుని ప్రముఖ యాంకర్ ఉదయభాను భావోద్వేగానికి గురయ్యారు. ఆయనతో తనకున్న సుదీర్ఘ అనుబంధాన్ని ఓ ఇంటర్వ్యూలో గుర్తుచేసుకున్నారు. రాకేష్ మాస్టర్ మరణవార్తను మొదట నమ్మలేదని, నిజమని తెలిసిన తర్వాత తీవ్రంగా బాధపడ్డానని తెలిపారు. తన కెరీర్ ప్రారంభంలో 'హోరాహోరీ' నృత్య కార్యక్రమం ద్వారా రాకేష్ మాస్టర్‌తో పరిచయం ఏర్పడిందని ఉదయభాను చెప్పారు. తనకు నృత్యంపై పెద్దగా అవగాహన లేని సమయంలోనూ 'నువ్వు ఈ స్టెప్ చేయగలవు' అంటూ ఆయన ఎంతో ధైర్యం ఇచ్చేవారని గుర్తుచేసుకున్నారు. రాకేష్ మాస్టర్ కేవలం నృత్య దర్శకుడు మాత్రమే కాదని, గొప్ప గురువని ఉదయభాను పేర్కొన్నారు. ప్రభుదేవా, శేఖర్ మాస్టర్, జానీ మాస్టర్ వంటి పలువురు ప్రముఖ నృత్య దర్శకులను తీర్చిదిద్దడంలో ఆయన కీలక పాత్ర పోషించారని తెలిపారు. తాను అనుకున్న విధంగా కళాకారులతో నృత్యం చేయించగల ప్రత్యేక ప్రతిభ ఆయన సొంతమని అన్నారు. అయితే జీవితంలో ఆయన తీసుకున్న కొన్ని నిర్ణయాలు, చుట్టూ ఉన్న పరిస్థితుల ప్రభావంతో చివరి రోజుల్లో పరిశ్రమకు, తనవారికి దూరం కావడం బాధాకరమని ఉదయభాను అన్నారు. ఇటీవల ఆయన ఆధ్వర్యంలో ఓ పాటలో నటించినప్పుడు పూర్తి ఉత్సాహంతో కనిపించారని గుర్తుచేసుకున్నారు. తెరపై తాను అనుకున్న ఫలితం వచ్చే వరకు నిద్రపోని పరిపూర్ణ గురువు రాకేష్ మాస్టర్ అని కొనియాడారు. రాకేష్ మాస్టర్ మరణం తర్వాత ఆయన శిష్యులు శేఖర్ మాస్టర్, జానీ మాస్టర్ కన్నీరు పెట్టుకున్న దృశ్యాలు తనను ఎంతో బాధించాయని ఉదయభాను చెప్పారు. ఎంతోమంది పేదలకు, అనాథలకు అన్నం పెట్టిన గొప్ప మనసున్న వ్యక్తి ఆయన అని గుర్తుచేసుకున్నారు. తనకు తెలిసినంతవరకు రాకేష్ మాస్టర్ ఎప్పుడూ తన పట్ల మంచిగానే ఉన్నారని, ఆయన జ్ఞాపకాలు ఎప్పటికీ నిలిచిపోతాయని ఉదయభాను పేర్కొన్నారు.



# వెయ్యి కోట్ల క్లబ్‌లో మమితా బైజు



**హైదరాబాద్, సెప్టెంబరు 18** : వరుస విజయాలతో మలయాళ భామ మమితా బైజు తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్నారు. గత ఆరు నెలల్లో ఆమె నటించిన సినిమాలు భారీ వసూళ్లు సాధించడంతో మొత్తం వెయ్యి కోట్ల మార్క్‌ను దాటినట్లు సమాచారం. దీంతో ప్రస్తుతం మమితా బైజు పేరు దక్షిణాది సినీ వర్గాల్లో మార్మోగుతోంది. ధనుష్‌తో కలిసి నటించిన 'కర' సినిమా పెద్దగా విజయాన్ని అందుకోకపోయినా రూ.50 కోట్లకు పైగా వసూళ్లు సాధించింది. ఆ తర్వాత ప్రదీప్ రంగనాథ్‌తో నటించిన 'డ్యూడ్' చిత్రం రూ.100 కోట్ల వసూళ్లు సాధించింది. విజయ్ నటించిన 'జననాయగన్' రూ.300 కోట్లు, ఇటీవల విడుదలైన మలయాళ చిత్రం 'బెత్లహోమ్ కుటుంబ యూనిట్' రూ.300 కోట్లు, సూర్య నటించిన 'విశ్వనాథ్ అండ్ సన్స్' రూ.260 కోట్ల వసూళ్లు సాధించినట్లు సమాచారం. ఇలా వరుస చిత్రాల విజయాలతో మమితా బైజు మార్కెట్ ఒక్కసారిగా పెరిగింది. ముఖ్యంగా ఆమె నటించిన మూడు చిత్రాలు వరుసగా రూ.200 కోట్లకు పైగా వసూళ్లు సాధించడం విశేషంగా మారింది. తక్కువ సమయంలోనే భారీ విజయాలు అందుకుంటూ మమితా బైజు తన కెరీర్‌లో దూసుకెళ్తున్నారు.

Printed, Published and Owned by **RAVU RAJITHA,** Printed at **KAKATHIYA PRINTERS,** LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY. RAJAMUDRA PUBLICATIONS,** Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684,** Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com